PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 95 | విజయవాడ, గురువారం 6 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 6 November 2025 | Rs

చేనేతకు చేయూత ఏదీ?

- ముడి సరుకు ధరలు పైపైకి
- గిట్టుబాటు ధర రాక కార్మికులు విలవిల
- పేరుకున్న ఆప్కో బకాయిలు

3

మరో గెలుపుపై టీమిండియా చూపు

- నేడు ఆస్ట్రేలియాతో నాల్గో టి20
- ప్రధానిని కలిసిన మహిళల వన్డే ప్రపంచకప్ ఛాంపియన్స్

8





న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ విజయోత్సాహం

న్యూయార్క్ మేయర్‌గా
మమ్దానీ ఘన విజయం!

• చరిత్ర సృష్టించిన భారతీయ అమెరికన్ • ట్రంప్‌కు తప్పని భంగపాటు

న్యూయార్క్ : అమెరికాలో భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ పార్టీ నేత 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ చరిత్ర సృష్టించారు. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. తద్వారా ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. మమ్దానీని ఎన్నుకుంటే న్యూయార్క్ నగరానికి నిధులు ఇవ్వబోమంటూ ట్రంప్ హెచ్చరించినా ప్రజలు ఏ మాత్రం ఖాతరు చేయలేదు. ఆఫ్రికాలో జన్మించిన మమ్దానీకి న్యూయార్క్ వాసులు పట్టం కట్టడం విశేషం. ట్రంప్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నగర మాజీ మేయర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ స్పష్టమైన ఆధిక్యత కనబరిచారు. తనను తాను డెమొక్రటిక్ సోషలిస్టుగా చెప్పుకునే మమ్దానీ న్యూయార్క్ నగరానికి తొలి ముస్లిం మేయర్ కాబోతున్నారు.

మమ్దానీకి 10,36,051 ఓట్లు లభించాయి. క్యూమోకు 8,50,000 ఓట్లు వచ్చాయి. అంటే క్యుమోపై మమ్దానీ దాదాపు 9 శాతం ఓట్ల ఆధిక్యత ప్రదర్శించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కర్టిస్ స్లివా మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 1965 తర్వాత న్యూయార్క్ మేయర్ పదవికి పోటీ పడిన ఏ అభ్యర్థికీ మమ్దానీకి వచ్చినన్ని ఓట్లు రాకపోవడం విశేషం. పోలైన ఓట్లలో మమ్దానీకి యాభై శాతానికి పైగా ఓట్లు లభించాయి. క్యూమోకు 41 శాతానికి పైగా ఓట్లు రాగా లిండ్సేకు కేవలం ఏడు శాతం ఓట్లే వచ్చాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా

అమెరికా స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత సంతతికి చెందిన నేతలు తమ సత్తా మిగతా 2లో

అమెరికాలో ప్రత్యామ్నాయ గళానికి పెద్ద సాధనం

- అభినందన కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు

2

తుపాన్‌తో కరువు మాఫ్

ఖరీఫ్‌లో 342 డ్రైస్పెల్, 151 మండలాల్లో తక్కువ వర్షం
ప్రభుత్వం ప్రకటించింది 37 మండలాలు

డ్రైస్పెల్ మండలాలు

జిల్లా	మొత్తం మండలాలు	డ్రైస్పెల్ మండలాలు
శ్రీకాకుళం	30	12
విజయనగరం	28	06
మన్యం	15	04
అల్లూరి	22	06
విశాఖపట్నం	11	10
అనకాపల్లి	24	08
కాకినాడ	21	10
కోనసీమ	22	14
తూ.గోదావరి	19	06
ప.గోదావరి	20	12
ఏలూరు	28	05
కృష్ణా	26	04
ఎన్‌టిఆర్	20	00
గుంటూరు	18	06
బాపట్ల	25	14
పల్నాడు	28	18
ప్రకాశం	39	15
నెల్లూరు	38	30
కర్నూలు	26	04
నంద్యాల	30	04
అనంతపురం	32	23
శ్రీసత్యసాయి	32	30
కడప	36	35
అన్నమయ్య	30	27
చిత్తూరు	32	20
తిరుపతి	34	19
మొత్తం	**686**	**342**

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఇటీవలి మొంథా తుపాన్ వర్షాలను చూపించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కీలక సమయాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావాన్ని, డ్రైస్పెల్స్‌ను పరిగణనలోకి తీసుకోకుండా పలు ప్రాంతాల్లోని కరువును ప్రభుత్వం మాఫ్ చేసింది. ఖరీఫ్‌లో కేవలం మూడు జిల్లాల్లోని 37 మండలాల్లోనే కరువును ప్రకటించింది. వాటిని సైతం 12 తీవ్ర స్థాయి, 25 మధ్యస్థ స్థాయి కరువు కింద వర్గీకరించింది. అన్నమయ్య జిల్లాలో 9 మధ్యస్థ, శ్రీసత్యసాయి జిల్లాలో 12 తీవ్ర, 13 మధ్యస్థ, ప్రకాశంలో 3 మండలాల్లో మధ్యస్థ కరువును గుర్తిస్తూ అక్టోబర్ 31 తేదీతో సర్కార్ ఉత్తర్వులు జారీ చేయగా, ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కరువు మండలాలను ప్రకటించే విషయంలో నిరుడు సైతం ప్రభుత్వం పిసినారితనానికి పోయింది. గత సంవత్సరం ఖరీఫ్‌లో 300 కు పైగా మండలాల్లో తీవ్ర దుర్భిక్షం తాండవించగా ఐదు జిల్లాల్లోని 54 మండలాలనే ప్రకటించింది. రబీలోనూ అదే బాణీని అమలు చేసి కరువును ఆరు జిల్లాల్లోని 51 మండలాలకు పరిమితం చేసింది.

వానల మొరాయింపు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కొంచెం ముందుగానే మే 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ప్రవేశించగా తొలి నాళ్లలో బాగానే వర్షాలు పడ్డాయి. అనంతరం దీర్ఘకాలం మొరాయించాయి. అడపాదడపా పడ్డ వర్షాలతో రైతులు అతికష్టం మీద సాగును సాగించారు. ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30. సీజన్ రాష్ట్ర సగటు సాధారణ వర్షపాతం 575.5 మిల్లీమీటర్లు కాగా 3.1 శాతం తక్కువగా 557.5 మిమీ నమోదైంది. అప్పటికి కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాలు తక్కువ వర్షం కురిసిన కేటగిరీలో ఉన్నాయి. ఎపి వ్యాప్తంగా 686 మండలాలుండగా 151 మండలాల్లో తక్కువ వర్షం రికార్డయింది. డ్రైస్పెల్ మండలాలు 342 కాగా సింగిల్ డ్రైస్పెల్ 256 మండలాల్లో, 84 మండలాల్లో డబుల్, 2 మండలాల్లో ట్రిపుల్ మిగతా 7లో

ఇక ప్రీ పెయిడ్ మీటర్లు

- ప్రయోగాత్మకంగా విద్యుత్ ఉద్యోగుల ఇళ్లకు
- ఆ తరువాత అందరికీ
- ఎపిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు నిర్ణయం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ


టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శివశంకర్ లోతేటి

ప్రజానీకం నుండి వ్యతిరేకత వ్యక్తమౌతతున్నప్పటికీ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకే పోతోంది. తాజాగా ఎపి ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని కొందరు విద్యుత్ ఉద్యోగుల ఇళ్లకు వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత మిగిలిన ఇళ్లకూ వీటిని అమర్చనున్నారు. ఎపి ఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేట బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తిరుపతి ఎపి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆయన డైరెక్టర్లు పి.ఆయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్‌రావులతో కలిసి ఆ సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలోని ఒక్కో జిల్లాలో వంద మంది విద్యుత్ ఉద్యోగుల స్వగృహాలకు ప్రయోగాత్మకంగా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చాలని, వీటి పనితీరు అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇ-వ్యాలెట్ రీఛార్జింగ్ ప్రక్రియ, ఎస్ఎంఎస్ అలర్ట్స్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వినియోగంపై పూర్తి స్థాయిలో నమ్మకం కలిగాక వాటిని వినియోగదారులకు అమర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంస్థ పరిధిలో 11 కెవి ఫీడర్లకు స్మార్ట్ మీటర్లను అమర్చే ప్రక్రియను వేగవంతం మిగతా 7లో


నేడే బీహార్‌లో
తొలి దశ ఎన్నికలు


తొలి దశ ఎన్నికల కోసం పాట్నా నుంచి వివిధ పోలింగ్ బూత్‌లకు సామాగ్రితో తరలి వెళ్తున్న సిబ్బంది

పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిదశ గురువారం జరగనుంది. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. గురువారం 18 జిల్లాలోని 121 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ తొలి దశలో 1,314 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, 3 కోట్ల 75 లక్షల మందికిపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పాట్నాతో సహా దర్భంగా, మధేపుర, సహర్సా, ముజఫర్‌పుర, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, వైశాలి, సమస్తిపుర్, బెగుసరాయి, లఖిసరాయి, ముంజెర్, షేక్‌పుర, నలంద, బక్సర్, భోజ్‌పుర జిల్లాలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమయి సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. అయితే భద్రతా కారణాల రీత్యా సిమ్రి భక్తియార్‌పూర్, మహిషి, తారాపూర్, ముంగేర్, జమాల్‌పూర్, సూర్యగఢ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 56 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటలకు కుదించారు. తొలి దశ ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ పోటీ పడుతున్న రఘోపూర్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి పోటీ చేస్తున్న తారాపూర్, లాలూప్రసాద్ యాదవ్ మరో కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ బరిలో ఉన్న మహౌతో పాటు సిపిఎం పోటీ చేస్తున్న మాంఝి, బిభూతిపూర్, పిప్రా వంటి కీలక నియోజకవర్గాలు ఉన్నాయి. బీహార్‌లోని మొత్తం 243 స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 11న రెండో దశలో మిగిలిన 122 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు 14న జరగనుంది.

అల్లూరి జిల్లాలో 'అథారిటీ'

- కొలిక్కిరాని పలు కీలక అంశాలు
- మార్కాపురం, మదనపల్లి జిల్లాల ఏర్పాటుకు సానుకూలత
- సిఎం వచ్చాకే తుది నిర్ణయం
- కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో చర్చ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లా అభివృద్ధికోసం ఒక అథారిటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. జిల్లాల పునర్విభజన కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం భేటీ బుధవారం సచివాలయంలో జరిగింది. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. లఅల్లూరి సీతారామరాజు జిల్లా సువిశాలంగా ఉండటం, జిల్లాలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లాలంటే 150 కిలోమీటర్లకు పైగా ప్రయాణించడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనంలో గుర్తించింది. ఈ నేపథ్యంలో సిఎం సూచనల మేరకే ఎఎస్‌ఆర్ జిల్లాలోని సుదూర ప్రాంతాలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేందుకు డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలించిన సబ్‌కమిటీ సానుకూలంగా స్పందించింది. అయితే, పలు కీలక అంశాలపై ఎటువంటి నిర్ణయం జరగలేదు. అథారిటీని ఏర్పాటు చేస్తే గిరిజనుల హక్కులు, 1-70 చట్టం అమలు తదితర అంశాలను కమిటీ చర్చించలేదని తెలిసింది. అథారిటీ ఏర్పాటు చేస్తే గిరిజన ప్రాంతాలకు కొత్తజిల్లా ఏర్పాటు చేయాలనే అంశానికి ముగింపు పలికినట్లేనా? గిరిజనప్రాంతాల అభివృద్ధికి ఉన్న ఐటిడిఎ ప్రాజెక్టుల పరిస్థితి ఏంటి? అథారిటీ కేవలం పరిపాలన వికేంద్రీకరణ కోసమా లేక ఇతరత్రా అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయా అనే ప్రశ్నలకు సమాధానాలు లేవు. అథారిటీ ఏర్పాటు చేస్తే ఎక్కడ ఏర్పాటు చేస్తారు? స్పెషల్ ఆఫీసరు ఐఎఎస్ క్యాడర్ ఉంటారా? లేక ఆర్‌డిఓ స్థాయి అధికారిని నియమిస్తారా అనే అంశాలపై కూడా మంత్రి వర్గ ఉపసంఘం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యమంత్రి వీటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఏర్పాటుకు కేబినెట్‌సబ్ కమిటీ సానుకూలత వ్యక్తం చేసింది. కొత్తగా రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై కూడా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా కందుకూరు డివిజన్‌ను ప్రకాశం జిల్లాలో కలపాలని డిమాండ్ పైన కూడా కమిటీ ఎటు తేల్చుకోలేకపోయినట్లు సమాచారం. పోలవరం ముంపు గ్రామాలపై కమిటీ చర్చించింది. 45 అడుగుల మేర ముంపునకు గురై గ్రామాల్లో ప్రజలకు పునరావాసం కల్పించాలని, అనంతరం ఆయా మండలాల ప్రజల అభీష్టం మేరకు వారిని ఏ డివిజన్‌లో కలపాలనే అంశంపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్‌సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి అనిత, జలవనరుల శాఖ మ ంత్రి నిమ్మల రామానాయుడు, రోడ్లుభవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిలు హాజరుకాగా, సత్యకుమార్‌యాదవ్, పి.నారాయణలు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా హాజరయ్యారు.

పంట నష్టం నమోదుకు గడువు పొడిగింపు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మొంథా తుపాను వల్ల జరిగిన పంట నష్టం నమోదుకు గడువును మరో రెండు రోజులు పొడిగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టానికి సంబంధించి రైతుల నుంచి గ్రీవెన్స్ స్వీకరించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి రైతుకూ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. పంట నష్టపరిహారం అందుకున్న రైతుల నుంచి కూడా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 98 శాతం ఇ-క్రాప్ జరిగిందన్నారు. ఇ-క్రాప్‌పై జగన్ ఎంచుకున్న గ్రామానికి వస్తే తాను చూపిస్తానంటూ సవాల్ విసిరారు. వైసిపి హయాంలో రైతుల నుంచి తీసుకున్న పంటల బీమా ప్రీమియం సొమ్మును చెల్లించకపోవడంతో రైతులకు పంట నష్టపరిహారం అందకుండాపోయిందని విమర్శించారు.

ఎస్‌ఆర్‌ఎంలో విద్యార్థులకు అస్వస్థత

- రూ.లక్షల్లో ఫీజులు, నాణ్యతలేని ఆహారం
- ఆందోళనకు దిగిన విద్యార్థులు
- విచారణ చేపట్టిన అధికారులు


3

సిఐటియు జాతీయ మహాసభకు కళాకారుల తోడ్పాటు అవసరం

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

హర్యానాలో 25 లక్షల ఫేక్ ఓట్లు

- బిజెపి, ఇసి కుమ్మక్కు
- ఓటు చోరీ వ్యవస్థను తీసుకొచ్చిన ప్రధాని, ఇసి
- దీన్ని బీహార్‌లో కూడా అమలు చేస్తారు
- రాహుల్ గాంధీ విమర్శలు


బుధవారం విలేకరుల సమావేశంలో హర్యానా ఓట్ల చోరీ గురించి వివరాలు వెల్లడిస్తున్న రాహుల్‌గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానాలో 25 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని, వీరితోనే అక్కడ గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. హర్యానాలో కాంగ్రెస్ అఖండ విజయాన్ని ఓటమిగా మార్చడానికి "ఆపరేషన్ సర్కార్ చోరీ"ని ప్రధాని మోడీ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించాయన్నారు. ప్రధాని మోడీ, ఇసి దేశ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి " క్రమబద్ధమైన ఓటు చోరి " వ్యవస్థను తయారు చేసిందని, దీన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అమలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. బుధవారం నాడు ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ "దిహెచ్-ఫైల్స్" అనే ప్రెజెంటేషన్‌తో నకిలీ ఓట్లను ఆధారాలతో సహ వెల్లడించారు. బిజెపితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై హర్యానాలో ఓట్ల దొంగతనంతో ఆ పార్టీని గెలిపించిందని విమర్శించారు. తాను ఇసిని వంద శాతం రుజువుతో ప్రశ్నిస్తున్నానని తెలిపారు. డూప్లికేట్, ఫేక్ ఓటర్లతో బిజెపి విజయానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి), ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సహకరిస్తున్నట్లు విమర్శించారు. ఫేక్ ఓట్లకు సంబంధించిన ఫోటోలు, రికార్డులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో ఆయన మీడియా ఎదుట ప్రదర్శించారు.

ప్రతి 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ

హర్యానా ఎన్నికల్లో 25,41,144 మంది నకిలీ ఓటర్లు ఉన్నారని, అంటే ప్రతి ఎనిమిది మంది ఓటర్లలో ఒక నకిలీ ఓటరు ఉన్నారని రాహుల్ గాంధీ తెలిపారు. ఎన్నికల కమిషన్ నకిలీలను ఎందుకు మిగతా 7లో

ఇంతకు ముందే ఎందుకు చెప్పలేదు : ఇసి

హర్యానాలో ఓట్ల చోరీ జరిగిందన్న రాహుల్‌గాంధీ విమర్శలకు ఎన్నికల సంఘం స్పందించింది. గత ఏడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, మరి ఇప్పటి వరకూ ఎందుకు ఓట్ల చోరీ గురించి ఫిర్యాదు చేయలేదని ఇసి ప్రశ్నించింది. ఇంతకు ముందు కాంగ్రెస్ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపింది. నకిలీ ఓట్లను గుర్తించడానికి, ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు రాజకీయ పార్టీలకు బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి అనుమతిచ్చామని తెలిపింది. అయితే రాహుల్ గాంధీ లేవనెత్తిన అభ్యంతరాలపై విచారణ చేపడతామని లేదా పరిశీలిస్తామని ఇసి చెప్పకపోవడం గమనార్హం...

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు మృతి

బీజాపూర్ : ఛత్తీస్‌గడ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. తర్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం-మరిమల అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాల సెర్చ్ ఆపరేషన్ చేస్తుండగా, మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని దీంతో తాము కూడా ఎదురుకాల్పులు చేసామని పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయి. అలాగే సంఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. తప్పించుకున్న వారికోసం అదనపు బలగాలను రంగంలోకి దించి, ఆ ప్రాంతంలో భారీస్థాయిలో గాలింపు చర్యలను భద్రతా దళాలు చేపట్టాయి.

మావోయిస్టులకు ఎదురుదెబ్బలు..

ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. వారి కార్యకలాపాలు స్తంభించాయి. ఒక్క బీజాపూర్ జిల్లాలోనే ఈ ఏడాది 461 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అదే సమయంలో 138 మంది వివిధ ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా, మరో 485 మంది అరెస్టు అయ్యారు. ఇటీవల కంకేర్, బీజాపూర్‌లో ఏకంగా 72 మంది మావోయిస్టులు ఒకేసారి ఆయుధాలు వదిలి లొంగిపోయారు. 2026 మార్చి నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఒక వైపు లొంగుబాట్లు పెరుగుతున్నా ఎన్‌కౌంటర్లు ఆగకపోవడం గమనార్హం.



అనిల్ అంబానీకి బిగుస్తోన్న ఉచ్చు

- మనీలాండరింగ్‌పై ఎస్ఎఫ్ఐఒ దర్యాప్తు
- కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయం

3

అరకులో జియో థర్మల్ ఎనర్జీ టెక్నాలజీ

- ప్రభుత్వానికి ఇఇఎస్ఎల్ ప్రతిపాదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అరకులో జియో థర్మల్ ఎనర్జీ టెక్నాలజీ (జిఇటి)ని ప్రవేశపెట్టాలని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్-ఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. దీని ద్వారా 50 శాతం వరకూ విద్యుత్ ఆదా కానుందని, ఇది రాష్ట్ర పర్యాటక రంగాన్ని జాతీయ స్థాయిలో లాంచ్‌ప్యాడ్‌గా మార్చనుందని పేర్కొంది. జిఇటి ఏర్పాటుపై గృహ నిర్మాణ, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌ను, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎమ్‌డి ఆమ్రపాలిని ఇఇఎస్ఎల్ సిఇఒ అఖిలేష్ కుమార్ దీక్షిత్ ఇటీవల సమావేశమై జిఇటి ఏర్పాటుపై వివరించారు. దీనికయ్యే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం 3-4 నాలుగేళ్ల స్వల్ప వాయిదాలతో తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుందని అఖిలేష్ వివరించారు. దీని తర్వాత దేశంలోనే అతిపెద్ద జియో థర్మల్ పైలట్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేస్తామని తెలిపారు. వినూత్నమైన ఈ క్లీన్ ఎనర్జీ పరిష్కారాలను స్వీకరించడం ద్వారా భూతాపం తగ్గింపు, పర్యావరణ అనుకూలమైన విధంగా శీతలీకరణను అందించడానికి భూమి ఉపరితలం కింద స్థిరమైన ఉష్ణోగ్రతలను ఉపయోగిస్తుందని పేర్కొన్నారు. దాదాపు 7-8 మీటర్ల లోతులో భూమి ఉష్ణోగ్రత ఏడాది పొడవుగా స్థిరంగా ఉంటుందని పేర్కొన్నారు. జిఇటి ఏర్పాటు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్తామని అజయ్‌జైన్ తెలిపారు.



న్యూయార్క్ మేయర్‌గా దిగ్విజయం సాధించిన జోహ్రాన్ మమ్దానికి అభినందనలు తెలుపుతూ విజయవాడలో జరిగిన ర్యాలీలో వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబురావు తదితరులు

జోహ్రాన్ మమ్దాని గెలుపు అమెరికాలో ప్రత్యామ్నాయ గళానికి పెద్ద సాధనం

ప్రపంచ అభ్యుదయ, ప్రగతిశీల శక్తులకు నైతిక బలం

అభినందన కార్యక్రమంలోవి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యూయార్కు నగర మేయర్‌గా జోహ్రాన్ మమ్దాని గెలుపు అమెరికా గడ్డపై ఒక ప్రత్యామ్నాయ గళాన్ని వినిపించేందుకు పెద్ద సాధనంగా మారుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మమ్దాని గెలుపు నేపథ్యంలో బుధవారం సాయంత్రం విజయవాడలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యాన అభినందన కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మమ్దాని గెలుపు ప్రపంచంలో అభ్యుదయ, ప్రగతిశీల శక్తులకు నైతిక బలం ఇస్తుందని తెలిపారు. ఆయన గెలవకుండా రిపబ్లికన్ పార్టీ, ట్రంప్ సర్వశక్తులూ ఒడ్డారని, గెలిపిస్తే నిధులు కూడా ఇవ్వబోనని హెచ్చరించారని, అయినా న్యూయార్కు ప్రజలు గెలిపించారని తెలిపారు. అమెరికాలో దరిద్రం పెరిగిందని, ప్రజల ఇబ్బందులు ఎక్కువయ్యాయని వివరించారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మమ్దాని గెలుపు ప్రజల విజయం అన్నారు. తను గెలిస్తే న్యూయార్కు ప్రజల సౌకర్యాల కోసం బడా కార్పొరేట్లపై పన్నులు వేస్తానని మమ్దాని బహిరంగంగా చెప్పారని,తమపై భారాలు ఎదుర్కొనేందుకు కార్పొరేట్లు ఆయనకు వ్యతిరేకంగా కుట్రలు చేసే అవకాశాలూ లేకపోలేదని అన్నారు. ట్రంప్ విధానాలను న్యూయార్కు ప్రజలు తిరస్కరించారని చెప్పారు. అటువంటి విధానాలనే దేశంలో మోడీ, చంద్రబాబు అనుసరిస్తున్నారని, ప్రపంచీకరణ సంస్కరణలు విఫలమయ్యాయని అనేదానికి ఇదొక నిదర్శనమని తెలిపారు. కేరళలో సాధించిన అత్యంత పేదరిక నిర్మూలన దేశానికి ఆదర్శంగా ఉందని అన్నారు. మానవ వనరుల అభివృద్ధిలో , విద్యా, ఆరోగ్యం, వైద్యంలో కేరళ మెరుగ్గా ఉందని తెలిపారు. ప్రత్యామ్నాయ కార్యక్రమం ఆధారంగా యువత ముందుకు నడవాల్సిన అవసరం ఉందని సూచించారు. న్యూయార్కు యూత్‌లో వచ్చిన మార్పు ప్రపంచ గమనం ఎలా ఉంటుందో తెలియజేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న యువత కూడా ప్రత్యామ్నాయ విధానాలపైపు ఆలోచించాలని శ్రీనివాసరావు కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలకు ఇది చెంపపెట్టని అన్నారు. ప్రపంచంపై భారాలు మోపడం, భారతీయులను నిందించడం వంటి ఘటనలకు వ్యతిరేకంగా ఇది ప్రజలిచ్చిన తీర్పు అన్నారు. ముఖ్యంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ పేరుతో అమెరికా చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా అమెరికాలోని అతిపెద్ద నగరమైన న్యూయార్కు ప్రజలే ఎదురుతిరిగారని పేర్కొన్నారు. ముఖ్యంగా వలసల పేరుతో భారతీయులపై వ్యతిరేకతను రెచ్చగొడుతూ విద్వేషాన్ని నింపుతున్న ట్రంప్‌నకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పన్నారు. అమెరికాలోనే జనం తిరగబడుతున్నారని, ట్రంప్ వ్యతిరేక పోరాటాలకు ఊపొచ్చిందని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు ఎదురుదెబ్బని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయేకాలంలో యువత ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. నగర ప్రముఖులు చుక్కపల్లి తిరుమలరావు మాట్లాడుతూ అమెరికాలో పేదరికం పెరుగుతోందని, కనీసం తినడానికి తిండిలేని పేదల సంఖ్య గణనీయంగా ఉందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో మమ్దాని గెలుపు అభినందనీయమని పేర్కొన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు న్యూయార్కు ఎన్నికల తీర్పు గొప్ప ఉత్తేజాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, డివైఎఫ్ఐ నాయకులు రామన్న, గిరిజన సంఘం నాయకులు అశోక్, సిపిఎం నగర నాయకులు కృష్ణ, చిన్నారావు, సిహెచ్.శ్రీనివాసరావు, కె.దుర్గారావు పాల్గొన్నారు.


ఒప్పందాల సందర్భంగా సంబంధిత అధికారులతో మంత్రి సవిత

టెక్స్‌టైల్స్ రంగంలో 9 ఎంఒయులు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు 9 సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ కేంద్రంగా జరిగే భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో ఈ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. అమరావతిలోని సచివాలయంలో పలు సంస్థల ప్రతినిధులతో మంత్రి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భాగస్వామ్య సదస్సులో ఎంఒయులకు ఆయా సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయన్నారు. రాయలసీమలో ఆయా సంస్థలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

రమేష్ అరెస్టుతో బిసిలు గుర్తుకొచ్చారా? : మంత్రి సవిత

కల్తీ మద్యం తయారీ, అమ్మకాల్లో జోగి రమేష్ అరెస్టయినప్పుడు బిసిలు గుర్తుకొచ్చారా? అని మాజీ సిఎం జగన్‌ను మంత్రి ఎస్ సవిత ప్రశ్నించారు. గత ఐదేళ్ల పాలనలో బిసిలపై తప్పుడు కేసులు బనాయించి, అక్రమ అరెస్టులు చేసినప్పుడు బిసిలు ఎందుకు గుర్తుకు రాలేదు? అని ప్రశ్నించారు. విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడిలోని బిసి భవన్‌లో నిర్వహించిన వర్క్‌షాపు ముగింపు సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఆదరణ పథకంలో భాగంగా చేతి, కుల వృత్తిదారులకు అధునాతన పరికరాలను అందజేస్తామన్నారు. అంతకముందు కౌండిన్య మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి సవిత నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, కార్పొరేషన్ల చైర్మన్లు అనంతకుమారి, వీరంకి వెంకట గురుమూర్తి సహా 17 మంది ఛైర్మన్లు, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ నూతన కార్యదర్శి వర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఐ రాష్ట్ర నూతన కార్యదర్శి వర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆ పార్టీ నాయకులు పి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కార్యదర్శి వర్గ సభ్యులుగా జె.వి సత్యనారాయణమూర్తి, పి.హరినాథరెడ్డి, కెవివి ప్రసాద్, డి.జగదీష్, జంగాల అజయ్ కుమార్, డేగా ప్రభాకర్, తాటిపాక మధు, పి.దుర్గాభవాని, కె.రామాంజనేయులను ఎన్నుకున్నారు. శాశ్వత ఆహ్వానితులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ ఎన్నికయ్యారు.

అధ్వాన పాలనను అడ్డుకోకపోతే అధోగతే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక పాలనతో ప్రజల జీవన పరిస్థితులు దయనీయంగా మారిపోయాయని, బలమైన ఉద్యమాలు నిర్మించడంతోనే ఈ అధ్వాన పాలనకు చరమగీతం పాడాలని సిపిఐ జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డిలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం పార్టీ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ, ప్రైవేటీకరణ, అప్పులు, అవినీతితో చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. కేవలం 17 నెలల కాలంలో రూ.2.50 లక్షల కోట్ల అప్పులు చేసి రికార్డు సృష్టించారని చెప్పారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సిపిఐ జాతీయ మహాసభలు ఇచ్చిన పిలుపు మేరకు వాపక్షాల ఐక్యత దిశగా పార్టీ శ్రేణులను నడిపించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ, సిపిఐ వందేళ్ల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని డిసెంబరు 26వ తేదీన జరిగే 'ఛలో ఖమ్మం' కార్యక్రమంలో ప్రతి జిల్లా నుంచి విస్తృతంగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 20 నుంచి 26వ తేదీ వరకూ శతవార్షికోత్సవ వారోత్సవాలు జరపాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌ఫోజర్‌కు రాష్ట్ర విద్యార్థులు

విమానంలో తీసుకెళ్లిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీలో జరిగే సైన్స్ ఎక్స్‌ఫోజర్ టూర్‌కు రాష్ట్ర విద్యార్థులు ఎంపికయ్యారు. ఎపి సైన్స్ సిటీ, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జిల్లాకు ఇద్దరు చొప్పున మొత్తం 52 మంది ఎంపికయ్యారు. గన్నవరం విమానాశ్రయం నుంచి బుధవారం విమానంలో వీరంతా ఢిల్లీకి బయలుదేరారు. సైన్స్ ఎక్స్‌ఫోజర్ సందర్శనకు బయలుదేరిన విద్యార్థుల బృందానికి మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ టూర్ ద్వారా ప్రాక్టికల్‌గా విద్యార్థుల్లో సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన పెరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు విజ్ఞానంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, సైన్స్ సిటీ ఆఫ్ ఎపి సిఇఒ కేశినేని వెంకటేశ్వర్లు.. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


ఢిల్లీలో సైన్స్ ఎక్స్‌ఫోజర్‌కు గన్నవరం నుంచి విమానంలో వెళ్తున్న విద్యార్థులు

ముగిసిన మంత్రి నారాయణ దుబాయ్ పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ సిఐఐ సమ్మిట్లో పెట్టుబడుల ఆహ్వానం కోసం మూడు రోజులుగా దుబాయ్‌లో పర్యటించిన మంత్రి నారాయణ బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. మూడు రోజుల పర్యటన విజయవంతమైందని ఆయన కార్యాలయం తెలిపింది. మూడోరోజు పర్యటనలో భాగంగా దుబాయ్‌లోని షార్జా ఛాంబర్‌ను పరిశీలించారు. అక్కడ బీహా కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ కంపెనీ వేస్ట్ మేనేజ్‌మెంట్, రికవరీ ప్లాంట్ ఏర్పాటు, వైద్యరంగంలో ప్రసిద్ధి చెందింది. యుఎఇలో ఉన్న పట్టణాల్లో చెత్తసేకరణ, ప్రాసెసింగ్ చేస్తున్న విధానాన్ని బీహా కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. అలాగే అజ్మాన్‌లో టెక్టాన్ ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎమ్‌డి ఎస్ లక్ష్మణ్‌తో మంత్రి నారాయణతో కూడిన అధికారుల బృందం సమావేశమైంది. విద్యుత్, ఆయిల్, గ్యాస్‌తోపాటు భారీ నిర్మాణాల ప్రాజెక్టుల్లో ఈ కంపెనీ సుదీర్ఘ అనుభవం ఉందని ప్రతినిధులు మంత్రికి వివరించారు. అలాగే కార్బోనాటిక్ కంపెనీ ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమయ్యారు.



వైద్య పరికరాలను తరలించొద్దు

- కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


వైద్యాన్ని ప్రయివేటీకరణ చేసే దిశగా ప్రభుత్వం ఉందని, పులివెందుల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాల తరలింపు ఆపాలని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని మెడికల్ కళాశాల ప్రారంభ సమయంలో అత్యాధునికమైన పరికరాలను సమకూర్చడం జరిగిందని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రిలోని పరికరాలను గుంటూరు, కర్నూలుకు తరలిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని టిడిపి నాయకులు ఈ ప్రాంతానికి అన్యాయం జరగకుండా అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ ధోరణి మారకపోతే వైసిపి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్.మనోహర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పాల్గొన్నారు.

27న సింగపూర్‌కు ఉత్తమ ఉపాధ్యాయులు

- డిసెంబరు 5న మెగా పిటిఎం
- విద్యాశాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధునాతన విద్యా విధానాలపై అధ్యయనానికి రాష్ట్రంలో 78 మంది బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలను ఈ నెల 27న సింగపూర్ పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. విద్యాశాఖపై ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డిసెంబరు రెండో తేదీ వరకు ఉపాధ్యాయులు సింగపూర్‌లోని ప్రముఖ పాఠశాలలను సందర్శించి అక్కడి అధునాతన సాంకేతికతతో అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, తరగతి గదుల్లో వాతావరణం తదితరాలపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని తెలిపారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుపరిచేందుకు ఏం చేయగలమో నివేదిక రూపంలో అందించాలన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గత ఏడాది మాదిరిగానే డిసెంబరు 5న మెగా పేరెంట్ టీచర్ మీట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పాఠశాలల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కడప మోడల్ స్మార్ట్ కిచెన్లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు, పబ్లిక్ లైబ్రరీల బలోపేతం, పాఠశాలల్లో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

కళాశాలల్లో ఫేస్ యాప్

కళాశాలల్లో తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరుకు చర్యలు చేపట్టాలని ఉన్నత విద్య సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశించారు. కెజి నుంచి పిజి వరకు స్టూడెంట్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా రూపొందించాలని, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పరిపాలనకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్‌ను రూపొందించాలని ఆదేశించారు. వర్సిటీల్లో స్టూడెంట్ ఫీడ్ బ్యాక్ మెకానిజం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటిఐలు, యూనివర్సిటీలను పరిశ్రమలతో అనుసంధానానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నైపుణ్యం పోర్టల్‌తో ప్రైవేట్ కళాశాలలను కూడా అనుసంధానం చేసి ప్రాంగణ నియామకాలకు గ్యారంటీ ఇవ్వాలని చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఇంటర్ విద్య సమీక్షలో ఆదేశించారు. ఇకపై అన్ని గ్రూపులకు వారాంతపు పరీక్షలు నిర్వహించడంతో పాటు ట్రాకింగ్ వ్యవస్థను రూపొందించామని అధికారులు వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 406 జాబ్ మేళాల ద్వారా 78 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించాయని స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సమీక్షలో మంత్రి లోకేష్ తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు, సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, కళాశాల విద్య డైరెక్టర్ భరత్ గుప్తా, సాంకేతిక విద్య డైరెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లో జనవరి నుంచి రేషన్ షాపుల్లో గోధుమపిండి

- నెలవారీ టార్గెట్లతో ధాన్యం కొనుగోలు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోని రేషన్‌షాపుల్లో ఒక్కో కార్డుదారునికి కిలో చొప్పున గోధుమ పిండి ఇవ్వనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ కానూరు పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనే 51లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. నవంబరు నెలలో 11లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 25లక్షల మెట్రిక్ టన్నులు, జనవరిలో 8లక్షల మెట్రిక్ టన్నులు, ఫిబ్రవరిలో 3లక్షల మెట్రిక్ టన్నులు, మార్చిలో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే విధంగా క్యాలెండర్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు 4,041 రైతు సేవా కేంద్రాలు, 3803 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 16,700మంది సిబ్బందితో సిద్ధమవుతున్నట్లు తెలిపారు. తేమ శాతం రీడింగ్ విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా ఒకే రకమైన కంపెనీ మిషన్లు వాడాలని నిర్ణయించినట్లు అవసరమైన చోట్ల బ్లూటూత్ ద్వారా లెక్కించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవంబరులో అకాలవర్షాలు పడుతున్న నేపథ్యంలో కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా 100 శాతం సబ్సిడీతో రైతు సేవా కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. జిల్లాల్లో ఇ క్రాప్ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఇ క్రాప్‌లో నమోదైన ప్రతి ఒక్కరి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఈ మీడియా స మావేశంలో సివిల్ సప్లై విసి అండ్ ఎండి ఢిల్లీరావు, డైరెక్టర్ గోవిందరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడం లేదు

- మాజీ మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయం దండగ అనే ఆలోచనలోనే సిఎం చంద్రబాబు ఉన్నారని తెలిపారు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయినా ఆయన తీరు మారలేదని, ప్రజా సమస్యలపై ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించడం లేదని విమర్శించారు. మొంథా తుపానుతో రైతులు అల్లాడుతుంటే చంద్రబాబు విదేశీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. క్రికెట్ మ్యాచులు చూస్తూ మంత్రి నారా లోకేష్ వినోదం పొందుతున్నారని, షూటింగుల్లా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మొక్కుబడి పరామర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

2లోపు హైకోర్టుకు నివేదిక

- టిటిడి పరకామణి కేసుపై సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

టిటిడి పరకామణి కేసుకు సంబంధించి వచ్చే నెల రెండో తేదీలోపు హైకోర్టుకు నివేదిక ఇస్తామని సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. బుధవారం ఆయన తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పరకామణిలో 1985 నుంచి రవికుమార్ ఉద్యోగం చేస్తున్నారని, అతనికి సంబంధించిన ఆస్తులు, ఆదాయాలు, బ్యాంకు అకౌంట్లను తమిళనాడు, కర్ణాటక, హైదరాబాదు, తిరుపతిలో గుర్తించి నివేదిక తయారు చేశామని తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం రూ.14 కోట్లు ఆస్తులు బయటపడ్డాయని, మార్కెట్ విలువ ప్రకారం వీటి విలువ రూ.45 కోట్లపైనే ఉంటుందని చెప్పారు. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయని, మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశం ఉందని అన్నారు. పరకామణి అవినీతి కేసులో సుమారు 20 మంది తమ సిబ్బంది విచారణ చేస్తున్నట్టు వెల్లడించారు. రవికుమార్‌కు సహకరించిన ఉద్యోగులను కూడా విచారించామని చెప్పారు. పరకామణిలో జరిగిన అవినీతిపై ఎవరి వద్దయినా ఇంకా ఏమైనా సమాచారం ఉంటే 94407 00921కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు బయట పెట్టబోమన్నారు. ఈ కేసుకు సంబంధించి టిటిడి పోలీసు బృందం, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పరకామణిలో రవికుమార్ పనిచేసే సమయంలో తనిఖీలు చేయకపోవడం వల్లే ఎంత పెద్ద అవినీతికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఈ కేసును ఎస్‌పితోపాటు డిఎస్‌పి, లీగల్ అడ్వైజర్, సైబర్ ఫోరెన్స్, టెక్నికల్ సిబ్బంది, ఇతర విభాగాల వారు విచారిస్తున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఎస్‌పి గంగాధర్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఫోన్ చేయాల్సిన నంబర్‌ను చూపుతున్న సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్

రెట్టింపు రాయల్టీ!

'ఎఎంఆర్' ఇష్టారాజ్యం

గ్రానైట్ గనుల లీజు ప్రైవేటు సంస్థకు అప్పగించిన ఫలితం

గగ్గోలు పెడుతున్న గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

గ్రానైట్ రాయల్టీ వసూళ్ల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకొని ఎం/ఎస్ ఎఎంఆర్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించింది. ఆ ప్రైవేట్ సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రాయల్టీని రెట్టింపు చేసింది. ప్రభుత్వ నిర్ణయించిన మేరకే కడతామని వ్యాపారులు అంటుండగా, తాము నిర్ణయించిన మేరకే కట్టాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తోంది. దీంతో, గ్రానైట్ వ్యాపారులు ఆ సంస్థకు కాకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తున్నారు. సమస్యను పరిష్కరించే వరకూ తాము ఈ విధంగానే చేస్తామని చెప్తున్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 6,157 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇందులో మిల్టీబుల్ బ్లేడ్ ఫ్యాక్టరీలు 1,250. స్లాబ్ సిస్టం కింద ఉన్నవి 2,750. ఇవన్నీ చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు నడుపుతున్నారు. రాయల్టీ ఆదాయం పక్కదారి పడుతోందంటూ దీనిని అరికట్టే పేరుతో వసూలు బాధ్యతను ఎం/ఎస్ ఎఎంఆర్ సంస్థకు ప్రభుత్వం రెండు నెలల క్రితం అప్పగించింది. గ్రావెల్, ఎగుమతి రాళ్లు, ఇతర మైనింగు కార్యకలాపాల నిర్వహిస్తున్న పరిశ్రమల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రాయల్టీ ప్రకారం నెలకు రూ.70.50 కోట్లు వస్తుంది. దీనిలో ప్రభుత్వానికి ఆ సంస్థ జిఎస్‌టితో కలిపి రూ.55 కోట్లు చెల్లించాలి. మిగతా 15.50 కోట్లు మిగులుతుంది. అయితే, రెట్టింపు (రూ.70 వేలు) రాయల్టీ కట్టాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల వసూలు రెట్టింపు కానున్నా ప్రభుత్వానికి చెల్లించే మొత్తంలో మాత్రం తేడా ఉండదు. రెట్టింపు వసూళ్ల వెనుక పంపకాలున్నాయనే చర్చ సాగుతోంది. అదనంగా చెల్లించలేమని, ఫ్యాక్టరీలు మూసేయడం తప్ప మరో మార్గంలేదని యజమానులు తేల్చి చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు, గనుల శాఖ మంత్రితో యజమానులు సమావేశమై చర్చలు జరిపారు. పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటైంది. ఏం పరిష్కారం చూపుతుందో చూడాలి.

న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ ఘన విజయం!

(మొదటిపేజీ తరువాయి)

చూపారు. న్యూయార్క్, వర్జీనియా నగర మేయర్లుగా ఎన్నికైన మమ్దానీ, గజాలా హష్మీలు భారత మూలాలు కలిగిన వారే కావడం విశేషం.

మమ్దానీ ప్రముఖ బాలివుడ్ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే. తండ్రి మహ్మద్ మమ్దానీ ఉగాండాకు చెందిన విద్యావేత్త. సలాం బాంబే, మాన్‌సూన్ వెడ్డింగ్ వంటి చిత్రాల దర్శకురాలైన మీరా నాయర్ భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న మమ్దానీ, తన ఎన్నికల ప్రచారంలో కూడా అవే భావాలను ప్రదర్శించి ఓటర్ల మనస్సు గెలుచుకున్నారు.

మమ్దానీకి ఎంఏ బేబీ అభినందనలు!

న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జోహ్రాన్ మమ్దానీకి సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ హృదయపూర్వక అభినందనలు తెలియచేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. భారత మూలాలు కలిగిన మమ్దాని విజయం మనందరికీ గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విజయాన్ని చూస్తుంటే ప్రజా సంక్షేమ విధానాలకే ప్రజలు మొగ్గు చూపారని స్పష్టమవుతోందన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్యవాద శక్తులమైన మేము ఈ సామ్రాజ్యవాద మిలటరీ, పెట్టుబడిదారి మీడియాకు వ్యతిరేకంగా మా వాణిని వినిపిస్తాం, మీకు, మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న పేద ప్రజలకు బాసటగా వుంటాం' అని బేబీ ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రజా వాణిని అణచేసే శక్తులకు వ్యతిరేకంగా కలిసి నిలబడాలని బేబీ ఆకాంక్షించారు.

చేనేతకు చేయూత ఏదీ?

- ముడి సరుకు ధరలు పైపైకి
- గిట్టుబాటు ధర రాక కార్మికులు విలవిల
- పేరుకున్న ఆప్కో బకాయిలు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఒకప్పుడు చేనేత కార్మికులకు చేతినిండా పని ఉండేది. అందుకు తగ్గట్లు ఫలితం దక్కేది. కూలి గిట్టుబాటు అయ్యేది. ప్రభుత్వ విధానాలతో ఈ రంగం కళావిహీనం అవుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న నేతన్నలకు భంగపాటు తప్పలేదు. ఉచిత విద్యుత్ పథకాన్ని అరకొరగానే అమలు చేస్తోంది. మరోవైపు 'నేతన్న నేస్తం' నిలిచిపోయింది. ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో నేసిన చీరల ధర పెరగడంతో కొనేవారులేక కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోతున్నారు. గతంలో కిలో పట్టు రూ.3 వేలు ఉండేది. ఆ తర్వాత రూ.5 వేలకు పెరిగింది. ప్రస్తుతం రూ.8 వేలకు చేరింది. జరీ కట్ట రూ.325 ఉండేది.

ఈ ఏడాది రూ.500 నుంచి రూ.600కు పెరిగింది. రంగులు గతంలో రూ.150 నుంచి రూ.170 ఉండగా, ప్రస్తుతం వీటి ధర రూ.300 నుంచి రూ.500కి చేరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నమోదయ్యారు. మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేస్తున్న వారు మరో 40 వేల మంది ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 15,700 మగ్గాలు ఉన్నాయి. వీటిలో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 నడుస్తున్నాయి. గత మూడు నెలలుగా చాలా మగ్గాలు పనిలేక మూతబడ్డాయి.

అమలు కాని ముఖ్యమంత్రి హామీ

గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ఒక్కొక్కరికీ రూ.24 వేలు ఏటా సాయం అందించింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి చివరిగా అందింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా నేతన్న నేస్తం ఇవ్వడం లేదు. ఈ ఏడాది ఆగస్టు ఏడున మంగళగిరిలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అతి త్వరలో 'నేతన్న నేస్తం' కింద రూ.25 వేల చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదు. జిఎస్‌టి రీయింబర్స్ చేస్తామని చెప్పినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. చేనేత మగ్గాలు ఉన్నవారికి 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఆగస్టు 7న చేనేత దినోత్సవం రోజున చంద్రబాబు హామీ ఇచ్చి అదే రోజు నుంచి అమలు కానుందని ప్రకటించారు. గోదావరి జిల్లాల్లో వంద యూనిట్ల వరకు ఈ పథకం అమలు అవుతున్నప్పటికీ మిగిలిన జిల్లాల్లో అమలు కావడం లేదు. కరెంటు సబ్సిడీ మాట అటుంచి విద్యుత్ ఛార్జీలను మాత్రం విపరీతంగా పెంచారు. 2017 నుంచి సహకార సంఘాలకు, చేనేత కార్మికులకు వివిధ పథకాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.177 కోట్లు బకాయిలను ప్రభుత్వం పెండింగులో ఉంచింది. 2018 నుంచి ఆప్కోకు పాలక వర్గం ఏర్పాటు కాలేదు. దీంతో, అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



చేనేత నేస్తున్న కార్మికుడు


కష్టానికి తగిన ఫలితం లేదు



రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలి రావడం లేదు. చేనేత రంగం కుదేలవుతున్న నేపథ్యంలో చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం జిఎస్‌టి రీయింబర్స్ చేస్తామని చెప్పి మాట తప్పింది.

– ఎస్.చక్రధర్, చేనేత కార్మికుడు, తాడిపర్తి, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా

చేనేత రంగాన్ని ఆదుకోవాలి



గతంలో రోజుకి రూ.600 నుంచి రూ.800 వరకూ కూలి వచ్చేది. ఇప్పుడు రూ.300 మించి రావట్లేదు. నేతన్న నేస్తం, ఇతర సంక్షేమ పథకాలను, ఉచిత విద్యుత్తు హామీని అమలు చేయాలి. ఆప్కోకు పాలకవర్గాలను తక్షణమే నియమించాలి. బకాయిలన్నీ విడుదల చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలి

– టి.వరహాలు, చేనేత కార్మికుడు,ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

ఆప్కోకు రూ.11 కోట్ల బకాయిలు



ఆప్కోకి రాష్ట్ర వ్యాప్తంగా రూ.11 కోట్లు బకాయిలు ఉన్నాయి. త్వరలోనే విడుదల చేస్తాం. ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి ఇప్పటికే జిఒ విడుదలైంది. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఇంకా అమలు కావడం లేదు.

– కురెళ్ల పెద్దిరాజు, ఆప్కో జనరల్ మేనేజర్ (ఎఫ్ఎసి)



తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

- రైతు సంఘాల నేతలకు సివిల్ సప్లైస్ ఎమ్‌డి ఢిల్లీరావు హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని, పంట నష్టపరిహారం చెల్లిస్తామనిరైతు సంఘాల నేతలకు ఎపి సివిల్ సప్లై కార్పొరేషన్ ఎమ్‌డి ఢిల్లీరావు హామీ ఇచ్చారు. పెనమలూరు మండలం, కానూరులో ఎపి పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో సంస్థ ఎమ్‌డి ఢిల్లీరావును ఎపి సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి రైతు సంఘాల నాయకులు వై కేశవరావు, కెవివి ప్రసాద్, పి జమలయ్య, ఎం హరిబాబు, ఎం యలమందరావు, యు వీరబాబు, ఎం ప్రసాద్ బాబు, కె శ్రీనివాసరావు కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు సంస్థ ఎమ్‌డి ఢిల్లీరావు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పరిష్కారానికి హామీ ఇచ్చారు. రైతులకు ఏ ఇబ్బంది రాకుండా చూస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ధాన్యంలో తేమ 17 శాతం కంటే అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. భారీ తుపానుకు పంట నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందని, మిగిలిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లిస్తామన్నారు. రైతులకు గోని సంచులు, రవాణా ఛార్జీలు మద్దతు ధరకు అదనంగా అందజేయాలని రైతు సంఘాల నాయకులు కోరగా.. సుముఖత వ్యక్తం చేశారు. మిల్లుల యాజమాన్యం నుంచి వచ్చే వేధింపులు ఆపాలని, రైతు సేవా కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని కోరారు. పంట నష్టపరిహారం అంచనా, ధాన్యం కొనుగోలు, తేమ శాతం వంటి అంశాల్లో ఏ సమస్య వచ్చినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని రైతు సంఘాల నాయకులకు ఢిల్లీరావు సూచించారు.

లైన్ దాటితే చర్యలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎవరైనా పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే చర్యలు తప్పవని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆ పార్టీ నేతలను హెచ్చరించారు. టిడిపి కార్యాలయం నుంచి ఆ పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఆయన మాట్లాడుతూ కొందరు నాయకుల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందన్నారు. అటువంటి నాయకులు వారి ప్రవర్తన మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి నేతల మధ్య విభేధాలు సృష్టించేందుకు వైసిపి ప్రయత్నిస్తోందని, అందరూ సఖ్యతతో పనిచేయాలని తెలిపారు.

సోషల్‌మీడియాలో వైసిపి చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టడంతో పాటు ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లాలన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ నిర్వహించకపోవడం వల్ల ప్రజల సమస్యలు సరైన రీతిలో పరిష్కారం కావడం లేదన్నారు. ఈ నెల 15వ తేదిలోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామస్థాయి కమిటీల వరకు పార్టీ నియామకాలు పూర్తి చేయాలని చెప్పారు. ఆలోపు పూర్తి చేయలేకపోతే పార్టీ జాతీయ అధ్యక్షులు ఎదుట హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, జిల్లా, జోనల్, పార్లమెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ...ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేసి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్నాయని విమర్శించారు. రాయితీలు ఇవ్వాల్సింది కార్పొరేట్ సంస్థలకు కాదని, పేదలకు ఇవ్వాలని అన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.లక్షల కోట్లు అవసరం లేదని, అన్ని ప్రాంతాల ప్రగతికి కట్టుబడి పనిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఎస్ఆర్ఎంలో విద్యార్థులకు అస్వస్థత

- రూ.లక్షల్లో ఫీజులు, నాణ్యతలేని ఆహారం
- ఆందోళనకు దిగిన విద్యార్థులు
- విచారణ చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలోని నీరుకొండ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నాణ్యమైన ఆహారం లభించక గత కొన్ని రోజులుగా వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు తెలిపిన సమాచారం ప్రకారం... గతనెల 29 నుంచి నిత్యం 20 నుంచి 30 మంది విద్యార్థులు కడుపు నొప్పి, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతులు, విరోచనాలు వంటి సమస్యలతో అల్లాడుతున్నారు. వీరికి ప్రాథమిక చికిత్స చేయించి, మందులు సరఫరా చేసి నిర్వాహకులు చేతులు దులుపుకొంటున్నారు. భోజనం, అల్పాహారం పంపిణీలో మార్పులు చేయడం లేదు. దీనిపై విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఆందోళన వ్యక్తం చేసినా, నిరసన తెలిపినా నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు ఆరుగురు విద్యార్థులు రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో వారిని మంగళగిరి ఎన్ఆర్ఐ, తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రికి, విజయవాడలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయం బుధవారం మీడియా ద్వారా జిల్లా అధికారులకు సమాచారం అందడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పలువురు అధికారులు విశ్వవిద్యాలయాన్ని సందర్శించి పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. తమ గోడు ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు అధికారులతో మాట్లాడేందుకు నిరాకరించి రాత్రి ఏడు గంటల సమయంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. వారం రోజుల వ్యవధిలో దాదాపు 200 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి రూ.4 లక్షల వరకు ఫీజు, భోజనం, హాస్టల్ కోసం రూ.లక్షకుపైగా వసూలు చేస్తున్నారని తెలిపారు. సమస్యలపై ప్రస్తావిస్తే వ్యక్తిగతంగా టార్గెట్ చేసి వేధిస్తున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కళాశాలలో సరఫరా చేస్తున్న ఆహారంలో నాణ్యత లోపాలపై విచారించి నివేదిక అందజేయాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.



ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సిఐటియు జాతీయ మహాసభకు కళాకారుల తోడ్పాటు అవసరం

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగు వరకూ నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభ విజయవంతానికి కళాకారుల తోడ్పాటు ఎంతో అవసరమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. మహాసభ సందర్భంగా నిర్వహించే శ్రామిక సాంస్కృతిక ఉత్సవాల సన్నాహక సమావేశం బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సిహెచ్.నర్సింగరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సినీ డైరెక్టర్ యాద్ కుమార్, వైజాగ్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు నరవ ప్రకాశరావు, వంగపండు దృశ్యంతు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు, ఐఎన్‌టియుసి నాయకులు బి.నాగభూషణం, లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణ మూర్తి, కేరళ కళా సమితి ఉపాధ్యక్షులు పికె.జోస్ ఢంకా మోగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. కార్మికుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా సహజ వనరులను కట్టబెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. వాటిని తిప్పికొట్టేందుకు భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం కానున్నాయని తెలిపారు. విశాఖలో సిఐటియు మహాసభ జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ సాంస్కృతిక సంబరాలను శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించాలని కోరారు. దాడి సత్యనారాయణ మాట్లాడుతూ.. విశాఖలో ఇటువంటి మెగా ఈవెంట్ నిర్వహించడం, కార్మిక ప్రతినిధులు హాజరు కావడం ఆనందదాయకమన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం విశాఖ వేదికగా సిఐటియు పిలుపునివ్వడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక హెచ్చరిక కానుందని తెలిపారు. నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిఐటియుకు ఉందని, సాంస్కృతిక ఉత్సవాలకు తమ వంతు సహాయంగా కళారూపాలను తీసుకు వస్తామని చెప్పారు. యాద్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల పోరాట వేదిక విశాఖలో జరిగే సాంస్కృతిక సంబరాలను అందరూ జయప్రదం చేయాలన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ.. విశాఖ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా ఇనుమడింపచేసే విధంగా ఈ సాంస్కృతిక సంబరాలు నిర్వహించాలని, సినీ రంగ ప్రముఖులను కూడా ఆహ్వానిస్తే మంచిదని తెలిపారు. దుష్యంతు మాట్లాడుతూ... సాంస్కృతిక ఉత్సవాలతో ప్రజల దృష్టిని ఆకర్షించాలన్నారు. మంగరాజు మాట్లాడుతూ.. కార్మిక చరిత్రకు, భవిష్యత్తుకు సంబంధించిన విషయాలను ఇతివృత్తంగా చేసుకొని పాటలు, నృత్య రూపకాలు, వీధి నాటికలు ప్రదర్శింపజేయనున్నామన్నారు. జనవరి 2న హష్మికి నివాళిగా వీధి నాటక ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. నాటక రంగ దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి సుందరయ్య, ఎర్రజెండా గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక ఉత్సవాల కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రమాప్రభ, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి, లోకేష్, గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు గౌరీ శంకర్, అన్నమయ్య కళాక్షేత్రం నాయకులు వై.అప్పారావు, కథక్ డ్యాన్స్ గురువు క్రితా కరుణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.



ఢంకా మోగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

అనిల్ అంబానీకి బిగుస్తోన్న ఉచ్చు

- మనీలాండరింగ్‌పై ఎస్ఎఫ్ఐఒ దర్యాప్తు
- కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయం



ముంబయి : రిలయన్స్ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీ చుట్టు మరింత ఉచ్చు బిగుస్తోంది. బ్యాంక్‌ల నుంచి వేల కోట్లు అప్పులు తీసుకుని.. నిధుల మళ్లింపు, మనీలాండరింగ్‌కు పాల్పడిన అంబానీపై కొత్తగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దర్యాప్తును ప్రారంభించింది. రూ.17,000 కోట్ల బ్యాంక్ రుణాల మళ్లింపునపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ, సెబీ విచారిస్తున్నాయి. తాజాగా రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, సిఎలతో సహా పలు గ్రూప్ కంపెనీల మోసాలపై దర్యాప్తును ప్రారంభించినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి.

భారీ ఎత్తున నిధులను దారి మళ్లించడం, కంపెనీల చట్టం కింద తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపాయి. ఈ కేసును తీవ్రమైన మోసాలపై దర్యాప్తు చేసే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఒ)కు బదిలీ చేసినట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ వర్గాలు వెల్లడించాయి. దర్యాప్తులో సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో బాధ్యులను ఎస్ఎఫ్ఐఒ గుర్తించడం ద్వారా తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఈ వారం ప్రారంభంలోనే రిలయన్స్ గ్రూప్ సంస్థలకు చెందిన దాదాపు రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను ఇడి అటాచ్ చేసింది. వీటిలో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన 30 ఆస్తులు, అధార్ ప్రాపర్టీ కన్సల్టెన్సీ, మోహన్ బీర్ హైటెక్ బిల్డ్, గమేసా ఇన్వెస్ట్ మెంట్ మేనేజ్ మెంట్, విహాన్ 43 రియల్టీ, కాంపియన్ ప్రాపర్టీస్ తదితర ఆస్తులున్నాయి. ఈ కేసులో ఇడి దూకుడు పెంచగా.. మరోవైపు ఎస్ఎఫ్ఐఒ దర్యాప్తు చేపట్టడంతో అనిల్ అంబానీ ఆక్రమాలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

వైట్‌కాలర్ ఉద్యోగ నియామకాల్లో 9 శాతం పతనం

- నౌకరీ జాబ్‌స్పీక్ రిపోర్ట్



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కార్యాలయ ఉద్యోగ నియామకాలు (వైట్‌కాలర్) క్షీణించాయని నౌకరీ డాట్‌కామ్ జాబ్‌స్పీక్ ఇండెక్స్ రిపోర్ట్ వెల్లడించాయి. గడిచిన నెలలో 9 శాతం పడిపోయాయని తెలిపింది. గతేడాది ఇదే నెలతో పోల్చితే దసరా, దీపావళి పండుగ సెలవులు నియామక ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపాయని పేర్కొంది. కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల శోధన ఫలితాల ఆధారంగా ప్రతి నెలా ఈ ఇండెక్స్‌ను విడుదల చేస్తుంది. గడిచిన నెలలో మొత్తం నియామక కార్యకలాపాలు స్తంభించినట్లు వెల్లడించింది. రిక్రూటర్లు పోస్ట్ చేసిన కొత్త ఉద్యోగ ప్రకటనలు, రెజ్యూమ్ డేటాబేస్‌లో ఉద్యోగ సెర్చ్‌ల ఆధారంగా జాబ్ మార్కెట్ ట్రెండ్‌లను నౌకరీడాట్‌కమ్ రూపొందిస్తుంది. అకౌంటింగ్, ఫైనాన్స్‌లో 15 శాతం, విద్యా రంగం 13 శాతం, బిపిఒ రంగంలో 6 శాతం చొప్పున నియామకాలు పెరిగాయి. మరోవైపు అత్యధికంగా ఉపాధి కల్పించే ఐటి రంగంలో 15 శాతం, బ్యాంకింగ్‌లో 24 శాతం చొప్పున నియామకాలు భారీగా పడిపోయాయి.

నువామా వెల్త్‌కు రూ.254 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.254.13 కోట్ల లాభాలను నమోదు చేసినట్లు నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.254.13 కోట్ల లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది. ఇదే సమయంలో రూ.1,056.84 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో 7.7 శాతం పెరిగి రూ.1,137.71 కోట్లకు చేరిందని తెలిపింది. ఆర్థిక ఫలితాల సందర్భంగా 2025-26కి గాను మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.70 డివిడెండ్‌ను అందించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీనికి రికార్డ్ తేదిని నవంబర్ 11గా నిర్ణయించింది. మరోవైపు ఈక్విటీ షేర్లను 1:5గా విభజిస్తున్నట్లు తెలిపింది.

ఎఐతో పెట్టుబడుదారులకే లాభాలు

- ఎఐ గాడ్‌ఫాదర్ జాఫ్రీ హింటన్

వాషింగ్టన్ : కృత్రిమ మేధ (ఎఐ) వల్ల కొత్త ఉద్యోగాలు అనుమానమేనని ఎఐ గాడ్‌ఫాదర్‌గా గుర్తింపు పొందిన జాఫ్రీ హింటన్ పేర్కొన్నారు. దీంతో కార్పొరేట్లు, పెట్టుబడిదారులకే లాభమని చెప్పారు. పెద్ద కంపెనీలు ఎఐ మీద భారీగా పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. దీంతో ఉద్యోగాలు చాట్‌బాట్లు, ఎఐ ఏజెంట్లతో భర్తీ అవుతున్నాయని.. ఇలాంటి పరిస్థితుల వల్ల ఎలన్ మస్క్ లాంటి వారు మరింత సంపద కూడబెడతారని తెలిపారు. ఇదే సమయంలో లక్షలాదిమంది నిరుద్యోగులుగా మారుతారని హెచ్చరించారు. తాను మస్క్‌ను ఒక ఉదాహరణగా మాత్రమే చెప్తున్నానన్నారు. ఎఐతో కొత్త ఉద్యోగాల పట్ల తనకు స్పష్టత లేదన్నారు. ప్రస్తుతం ఎఐ వ్యవస్థలు మానవుల నియంత్రణలోనే ఉన్నాయన్నారు. అయితే ఎప్పటికీ ఇలాగే కొనసాగుతాయని మాత్రం చెప్పలేమని ఆందోళన వ్యక్తం చేశారు.

12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి పెచ్చరిల్లిందంటూ ఎసిబికి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై అవినీతి నిరోధకశాఖ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించినట్లు ఎసిబి కార్యాలయం పేర్కొంది.

ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విశాఖపట్నం జగదాంబ సెంటర్, పెదగంట్యాడ, మధురవాడ, భోగాపురం, ఇబ్రహీంపట్నం, నరసరావుపేట, ఒంగోలు, రేణిగుంట, రాజంపేట, చిలమత్తూరు, ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా భోగాపురం, జగదాంబ సెంటర్, ఇబ్రహీంపట్నం, ఒంగోలు, నెల్లూరు, నరసరావుపేటల్లో లెక్క చూపని రూ.10 వేల నుంచి రూ.75 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. వివిధ రికార్డులు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్‌లో ఉల్లంఘనలు, రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉంచిన పత్రాలు, పార్టీలకు జారీ చేయని రిజిస్టర్డ్ పత్రాలు, నిషేధిత ఆస్తుల రిజిస్ట్రేషన్, నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్స్ అమ్మకాల రిజిస్టర్లు, ఇందుకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డులను ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలు పురోగతిలో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.




తిరుమల ఘాట్ రోడ్డులో కొండచిలువ

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో మంగళవారం రాత్రి కొండ చిలువ కలకలం రేపింది. వినాయకస్వామి ఆలయాన్ని దాటి వెళ్తున్న కొంతమంది యాత్రికులకు రహదారిపై కొండచిలువ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. మరికొంతమంది యాత్రికులు తమ మొబైల్ ఫోన్‌లో కొండచిలువను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మారుతి సుజుకి 3 కోట్ల అమ్మకాలు



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి విక్రయాల్లో 3 కోట్ల యూనిట్ల మైలురాయిని చేరినట్లు ఆ కంపెనీ వెల్లడించింది. 1983 డిసెంబర్ 14న మారుతీ 800తో కార్ల తయారీని ప్రారంభించింది. తొలి కోటి కార్ల విక్రయాలకు తమకు 28 సంవత్సరాల 2 నెలలు పట్టిందని తెలిపింది. తర్వాతి కోటి వాహనాలను దాదాపు ఏడున్నరేళ్లు, మిగిలిన కోటి వాహనాలకు 6 సంవత్సరాల 4 నెలలు పట్టిందని ఆ సంస్థ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో అత్యధికంగా 47 లక్షల ఆల్టోలను విక్రయించినట్లు వెల్లడించింది. తర్వాతి స్థానంలో వ్యాగనార్ 34 లక్షలు, స్విఫ్ట్ 32 లక్షలు చొప్పున అమ్మకాలు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం దేశంలో ప్రతి వెయ్యి మందిలో 33 మంది వద్ద మాత్రమే కార్లు ఉన్నాయని మారుతీ సుజుకీ ఇండియా ఎండి, సిఇఒ హిశాషి టెకుచి తెలిపారు.

టెస్లా ఇండియా హెడ్‌గా శరద్ అగర్వాల్



న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన విద్యుత్ వాహన దిగ్గజ సంస్థ టెస్లా భారత కార్యకలాపాలకు నూతన సారథిగా శరద్ అగర్వాల్‌ను నియమించింది. ఇంతక్రితం ఆయన లంబోర్గినీ ఇండియా హెడ్‌గా, మహీంద్రా అండ్ మహీంద్రా యూనిట్ క్లాసిక్ లెజెండ్స్‌లో చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా పనిచేశారు. మరోవైపు టెస్లా ఈ ఏడాది ముంబయి, ఢిల్లీలో టెస్లా డీలర్‌షిప్‌లను తెరవడం ద్వారా ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

సంపాదకీయం

సోషలిస్టుకు పట్టం

అమెరికాలో వివిధ నగరాలకు జరిగిన మేయర్, గవర్నర్ ఎన్నికలు ఒక కీలకమైన రాజకీయ మార్పునకు సంకేతంగా నిలుస్తున్నాయి. అమెరికాకు కుంభస్థలం వంటి న్యూయార్క్ మహానగరంలో తనను తాను సోషలిస్టుగా ప్రకటించుకున్న డెమోక్రటిక్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ సాధించిన విజయం అపూర్వం! పెట్టుబడిదారీ విధానం వికటాట్టహాసం చేసే చోట సామాన్యుడి ఆకాంక్షల స్వరాన్ని జోహ్రాన్ గట్టిగా వినిపించారు. ప్రపంచ దేశాలపై పెత్తనానికి సామ్రాజ్యవాద వ్యూహాలు రూపొందేచోట ప్రజల ఆరోగ్యం, పబ్లిక్ స్కూళ్ల బలోపేతం, ఇంటి అద్దెల నియంత్రణ వంటి అంశాలను ఆయన ఎజెండాగా చేశారు. కార్పొరేట్ల లాభాలు మాత్రమే చర్చలుగా సాగే చోట కార్మికుల హక్కులను ఆయన ప్రస్తావించారు! ఫలితంగా ఇండో-ఆఫ్రికన్ మూలాలున్న జోహ్రాన్ మమ్దానీని ఓడించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అండదండలతో సమస్త కార్పొరేట్ శక్తులు ఏకమయ్యాయి. వారి పెట్టుబడులతో నడిచే మీడియా సంస్థలు పెద్ద ఎత్తున విద్వేష ప్రచారాన్ని సాగించాయి. అధ్యక్షుడు ట్రంప్ అయితే జోహ్రాన్‌ను కమ్యూనిస్టుగా అభివర్ణించాడు. ఆయన గెలిస్తే అమెరికన్ సమాజంలో ఆర్థిక, సామాజిక విపత్తు సంభవిస్తుందని భయోత్పాతం సృష్టించే ప్రయత్నం చేశాడు. 'న్యూయార్క్‌కు చట్టబద్ధంగా రావాల్సినవి తప్ప అదనంగా నిధులు ఇచ్చేది లేదు' అంటూ బెదిరించాడు. చివరకు సొంత పార్టీ అభ్యర్థిని కాదని, డెమోక్రటిక్ పార్టీ నుండే తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆండ్రూ కుమోకు తన మద్దతు ప్రకటించారు. అయినా, ప్రజానీకం ఆ కుయుక్తులను ఏమాత్రం పట్టించుకోలేదు.

న్యూయార్క్‌తో పాటు వర్జీనియా, స్టాన్‌ఫోర్డ్, సియాటెల్, చికాగో వంటి నగరాల్లో సైతం డెమోక్రటిక్ అభ్యర్థులు గెలవడం అమెరికన్ సమాజంలో వ్యక్తమవుతున్న మార్పునకు సంకేతంగా చూడవచ్చు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గెలుపొందిన హైదరాబాద్ మూలాలున్న గజాలా హాష్మీ కూడా ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా స్పష్టంగా గళమిప్పిన తీరు ఓటర్లను ఆకట్టుకుంది. కొన్ని సంవత్సరాలుగా ధనికులకు పన్ను రాయితీలు, వలసదారులపై కఠిన చర్యలు, సమాజాన్ని విభజించే వ్యాఖ్యలు వంటి ట్రంప్ విధానాలు ప్రజల్లో విసుగు తెప్పించాయి. ప్రపంచ దేశాలపై ట్రంప్ చేపట్టిన టారిఫ్‌ల యుద్ధం కూడా అమెరికాలో వ్యతిరేక ఫలితాలను చూపిస్తోంది. అదే సమయంలో యువత, మధ్యతరగతి, మైనారిటీ వర్గాలు ప్రగతిశీల, సోషలిస్టు విలువల వైపు మొగ్గు చూపుతున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. కార్పొరేట్ల లాభాలు పరమావధిగా సాగే స్వార్థపూరిత రాజకీయాలకు భిన్నంగా అమెరికాలో కొత్త తరం ఓటర్లు క్రమేణా ప్రత్యామ్నాయ విధానాల వైపు ఆకర్షితులవుతున్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనం. 'ప్రజల సంక్షేమం-కార్పొరేట్ ప్రయోజనం' మధ్య జరుగుతున్న పోరాటంలో అమెరికన్ ప్రజలు స్పష్టంగా మొదటిదాని వైపునకే మొగ్గు చూపుతున్నారు. అమెరికా రాజకీయాల్లో ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలు మళ్లీ తెరమీదకు వస్తున్నాయి. ప్రజలు మార్కెట్ శక్తులకంటే మానవ శక్తులను విశ్వసించడం స్పష్టంగా కనపడుతోంది.

బ్యాలెట్ పేపర్లో తన పేరు లేనందువల్లే ఓటమి పాలయినట్లు ట్రంప్ వ్యాఖ్యానించడం ఎన్నికల ఫలితాల తరువాత కూడా ఏమాత్రం మారని ఆయన తీరుకు నిదర్శనం. నెల రోజులుగా కొనసాగుతున్న షట్‌డౌన్ కూడా తన ఓటమికి కారణంగా ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రఖ్యాత ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావించడం విశేషం. 'ఒక శకం ముగిసినప్పుడు...సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి గళం విప్పినప్పుడు..చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి.' అన్న నెహ్రూ వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. నిజమే, సామాన్యులను పీడించి, వారి రక్తమాంసాలతో తెగబలిసిన సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుండి బయటపడటానికి, ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేయడానికి ప్రపంచం సిద్ధమౌతోంది. ఆ ప్రత్యామ్నాయం సోషలిజమే !

మహనీయుల మాట



మానవ జాతిలో సగభాగం అయిన మహిళలు పెట్టుబడిదారీ వ్యవస్థలో రెట్టింపు దోపిడీకి గురవుతారు.

- లెనిన్

సందర్భం

అక్టోబర్ విప్లవం

ఓ నవశకం

అక్టోబరు విప్లవం కేవలం జార్ చక్రవర్తుల నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగిన విప్లవం మాత్రమే కాదు. అది ఓ నూతన విప్లవ శకావిష్కరణ. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వ్యతిరేకత, సామ్యవాదం దాని లక్షణాలు. సార్వజనీన ప్రాసంగికత ఈ విప్లవానికి ఉన్న విలక్షణత. లెనిన్ గానీ ఇతర బోల్షివిక్కులు గానీ ఈ విప్లవాన్ని కేవలం జాతీయ సంఘటనగా మాత్రమే పరిగణించలేదు. ప్రపంచ సామ్యవాద విప్లవానికి రిహార్సల్‌గా భావించారు.



ప్రకాశ్ కరత్

1917 అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్రలో నవశకారంభం. అక్టోబరు విప్లవ శతజయంతి సందర్భం 20వ శతాబ్ది చరిత్ర గమనాన్ని పునరావలోకనం చేసుకోవటానికీ, అక్టోబరు విప్లవపు చారిత్రక ప్రాధాన్యత, సమకాలీన ప్రాసంగికతను అర్థం చేసుకోవటానికీ తగిన సందర్భం.

ప్రపంచ చరిత్రలో దోపిడీదారుల ఆధీనంలోని రాజ్యాన్ని దోపిడీకి గురవుతున్న ప్రజానీకం కూల్చివేసిన తొలి సందర్భం అక్టోబరు విప్లవం. పెట్టుబడిదారీ వ్యవస్థకు నికరమైన విస్పష్టమైన ప్రత్యామ్నాయంగా సోషలిజం ప్రపంచ యవనికపై అవతరించిన సందర్భం. అక్టోబరు విప్లవం యొక్క ఈ లక్షణమే సమకాలీన ప్రపంచంలో మరింత ప్రాసంగికత కల్గిన అంశం.

అక్టోబరు విప్లవం కేవలం జార్ చక్రవర్తుల నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగిన విప్లవం మాత్రమే కాదు. అది ఓ నూతన విప్లవ శకావిష్కరణ. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వ్యతిరేకత, సామ్యవాదం దాని లక్షణాలు. సార్వజనీన ప్రాసంగికత ఈ విప్లవానికి ఉన్న విలక్షణత. లెనిన్ గానీ ఇతర బోల్షివిక్కులు గానీ ఈ విప్లవాన్ని కేవలం జాతీయ సంఘటనగా మాత్రమే పరిగణించలేదు. ప్రపంచ సామ్యవాద విప్లవానికి రిహార్సల్‌గా భావించారు.

సమకాలీన సామ్రాజ్యవాద నేపథ్యం నుండి కాకుండా మరో నేపథ్యం నుండి పరిశీలిస్తే అక్టోబరు విప్లవం ప్రాధాన్యత అర్థం చేసుకోలేము. సామ్రాజ్యవాదానికి సంబంధించి మార్క్సిస్టు అవగాహనను రూపొందించటం లెనిన్ మార్క్సిజానికి అందించిన విశేషమైన తోడ్పాటు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని విప్లవ వ్యూహంలో అంతర్భాగంగా మార్చిన ఘనత లెనిన్‌కే దక్కుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వవ్యాప్తమైన ఆర్థిక చట్రంగా రూపాంతరం చెందటాన్ని మార్క్స్ స్వయంగా పరిశీలించాడు. ఆయన మరణానంతరమే పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానంగా ఎదిగింది. మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతిని లెనిన్ సమర్థవంతంగా ఆకళింపు చేసుకున్నాడు. సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాపిత వ్యవస్థగా ఎదుగుతున్న తీరును, గుత్తపెట్టుబడిదారీ దశకు చేరటానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండాల్సిన అంతర్గత లక్షణాలను, ఈ దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణాల ప్రాతిపదికన ప్రపంచ విప్లవ వ్యూహాన్ని నిర్ధారించటంలో ఈ లెనినిస్టు అవగాహన దోహదం చేసింది.

సామ్రాజ్యవాదం గురించి లెనిన్‌కు విశేషమైన అవగాహన ఉంది. ఈ అవగాహనతోనే పరిపూర్ణమైన పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందిన ఆధునిక దేశాల్లోనే విప్లవాలు విజయసాధ్యమవుతాయి అన్న సాంప్రదాయక మార్క్సిస్టు అవగాహన నుండి వైదొలిగాడు లెనిన్. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అసమాన అభివృద్ధి కారణంగా సామ్రాజ్యవాద దశలో అభివృద్ధి ప్రమాణాల్లో వెనకబడిన దేశాల్లో సైతం సోషలిస్టు విప్లవం సాధ్యమవుతుందని లెనిన్ సూత్రీకరించాడు. సామ్రాజ్యవాదం యావత్ ప్రపంచాన్నీ పెట్టుబడిదారీ సంబంధాల్లో బంధించి ఉంచుతుంది. అటువంటి చక్రబంధంలోని బలహీనమైన లింకును తెగ్గొట్టడం సాధ్యమవుతుంది. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో జారిస్టు రష్యా ఈ ప్రపంచవ్యాపిత పెట్టుబడిదారీ వ్యవస్థలో బలహీనమైన లింక్ అని లెనిన్ తొలిసారి గుర్తించాడు. మొదటి ప్రపంచ యుద్ధం కూడా సామ్రాజ్యవాద దేశాల్లోని వైరుధ్యాల ఫలితమే.

సోషలిస్టు దశ

అక్టోబరు విప్లవ వ్యూహంలో రెండో ముఖ్యమైన ముందడుగు బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి కార్మికవర్గ నాయకత్వాన సామ్యవాద విప్లవంగా మార్చవచ్చు అన్న అవగాహన. సోషలిస్టు విప్లవం అవిచ్ఛిన్నంగా పురోగమించటానికిగాను ప్రజాతంత్ర విప్లవానికి కూడా కార్మికవర్గమే నాయకత్వం వహించాలని తొలుత ప్రతిపాదించిన దార్శనికుడు లెనిన్.



శాంతి, భూమి, ఆహారం అన్న నినాదంలో బోల్షివిక్ విప్లవం స్ఫూర్తి ప్రతిఫలిస్తోంది. భూస్వామ్య వర్గపు ఆధీనంలో ఉన్న విశాల భూఖండాలను ముక్కలు చేసి రైతాంగానికి అప్పగించాలన్న బోల్షివిక్ పార్టీ కార్యక్రమం రైతాంగాన్ని కార్మికవర్గ నాయకత్వంలో విప్లవోద్యమంలో భాగస్వాములను చేసింది. విప్లవాన్ని ఆచరణసాధ్యం చేసింది.

లెనిన్ ప్రతిపాదించినట్లు బూర్జువా ప్రజాతంత్ర విప్లవం, సోషలిస్టు విప్లవం మధ్య చైనా గోడ ఏమీ లేదు. బోల్షివిక్ పార్టీ అనుసరించిన ఈ వైఖరి కారణంగానే జార్ పాలనను కూలదోసిన ఫిబ్రవరి విప్లవం తర్వాతి కాలంలో సోషలిస్టు విప్లవ సాధన సాధ్యమైంది. ప్రవాసం నుండి తిరిగి వచ్చిన లెనిన్ ఫిబ్రవరి విప్లవంతో రష్యాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవ దశ పరిసమాప్తమైందని తన ఏప్రిల్ సిద్ధాంతంలో సూత్రీకరించాడు. ఈ విప్లవ దశ తర్వాత దేశంలో ప్రభుత్వం బూర్జువావర్గం పరం కారాదనీ, కార్మిక కర్షక ఐక్య సంఘటన ద్వారా అధికారం చేబూని సోషలిస్టు విప్లవ సాధనగా నడిపించాలని ప్రతిపాదించాడు.

కార్మికవర్గం నాయకత్వం వహించి సోషలిస్టు విప్లవ సాధనను ఆచరణ సాధ్యం చేయాలన్న సృజనాత్మక వ్యూహం కొనసాగింపులో భాగంగానే బోల్షివిక్ పార్టీ రెండు కీలకమైన వ్యూహాత్మక లక్ష్యాలను ముందుకు తెచ్చింది. వ్యవసాయక కార్యక్రమం, జాతీయ కార్యక్రమం (జాతుల సమస్యకు బోల్షివిక్ పార్టీ ప్రతిపాదించిన పరిష్కారం) అవి.

వ్యవసాయక కార్యక్రమం

బోల్షివిక్ పార్టీ ప్రతిపాదించిన వ్యవసాయక కార్యక్రమం కార్మిక కర్షక ఐక్య సంఘటన పునాదిగా ప్రతిపాదించిన కార్యక్రమం. భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలన్న నినాదం ద్వారానే విశాలమైన రష్యా రైతాంగాన్ని కార్మికవర్గం సరసన విప్లవోద్యమంలో నడిపించటం సాధ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న అర్ధభూస్వామ్య దేశంలో విప్లవ వ్యూహం కార్మిక కర్షక ఐక్యసంఘటన ఆధారంగానే నడవాలని ప్రతిపాదించాడు లెనిన్. ఫిబ్రవరిలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం విజయవంతం అయ్యాక భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలని, దున్నే వానికే భూమిపై హక్కు ఇవ్వాలన్న డిమాండ్లను బోల్షివిక్ పార్టీ ముందుకు తెచ్చింది. శాంతి, భూమి, ఆహారం అన్న నినాదంలో బోల్షివిక్ విప్లవం స్ఫూర్తి ప్రతిఫలిస్తోంది. భూస్వామ్య వర్గపు ఆధీనంలో ఉన్న విశాల భూఖండాలను ముక్కలు చేసి రైతాంగానికి అప్పగించాలన్న బోల్షివిక్ పార్టీ కార్యక్రమం రైతాంగాన్ని కార్మికవర్గ నాయకత్వంలో విప్లవోద్యమంలో భాగస్వాములను చేసింది. విప్లవాన్ని ఆచరణసాధ్యం చేసింది. ఫిబ్రవరి విప్లవం నాటికి బోల్షివిక్ పార్టీ ప్రధానంగా పారిశ్రామిక కార్మికులు, బాధ్యతల నుండి వైదొలగిన సైనికులే సభ్యులుగా ఉన్నారు. సైనికులను లెనిన్ 'యూనిఫారం ధరించిన రైతాంగం' అని సంబోధించేవాడు. యుద్ధరంగం నుండి విరమించిన ఈ సైనికులే బోల్షివిక్ పార్టీ వ్యవసాయక కార్యక్రమాన్ని – దున్నేవాడికే భూమి – అన్న నినాదాన్ని ఊరూరా చేరవేశారు.

జాతుల సమస్య

జారిస్టు రష్యా అనేక జాతులు సమాహారం. జార్ నియంతృత్వం కాడి బరువును మోస్తున్న జాతులు వెయ్యికి పైగా ఉన్నాయి. జార్ పరిపాలనలో ప్రాధాన్యత కోల్పోయి అస్థిత్వానికి దూరమైన జాతుల ఆత్మగౌరవం కోసం సాగించే పోరాటం కీలకమైన పోరాటంగా మారింది. జార్ పాలనకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో భాగంగా జాతుల స్వయంప్రతిపత్తి కావాలన్న నినాదాన్ని బోల్షివిక్ పార్టీ ముందుకు తెచ్చింది. జాతుల సమస్య మీద లెనిన్ "జాతులకు రష్యా నుండి వేరుపడే హక్కు కావాలి. సాధ్యమైనంత విస్తృతమైన స్వయంప్రతిపత్తి కావాలి. అల్పసంఖ్యాక వర్గాల హక్కుల పరిరక్షణకై విస్తృతమైన మార్గదర్శకాలు – ఇది జాతుల సమస్యకు సంబంధించిన విప్లవాత్మక కార్మికవర్గపు కార్మికవర్గం." అల్ప సంఖ్యాక జాతులు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో బోల్షివిక్ పార్టీ విప్లవానికి ముందు, తర్వాతి కాలంలో అనుసరించని వ్యూహాలు, ఎత్తుగడలు కూడా విప్లవం విజయవంతం కావటానికి ముఖ్యమైన దోహదకారిగా మారింది. ఈ వివిధ జాతుల సమాహారమే తర్వాతి కాలంలో సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల సంఘంగా మారింది.

జాతుల విషయంలో రష్యా తీసుకున్న వ్యూహాత్మక వైఖరి కేవలం రష్యాకే పరిమితం కాలేదు. 1920లో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ మహాసభలో కూడా లెనిన్ జాతులు, వలస దేశాల సమస్యపై ప్రతిపాదించిన సిద్ధాంతంలో సైతం ఇదే సూత్రాన్ని ప్రతిపాదించాడు. ప్రపంచ విప్లవానికి సంబంధించిన వ్యూహాత్మక ఎజెండాగా వలస దేశాల విముక్తి సమస్యను మార్చటంలో అక్టోబరు విప్లవం మెరికలాంటి పాత్ర పోషించింది.

రాజ్యము – విప్లవం

అక్టోబరు విప్లవంలో రాజ్యాధికారం హస్తగతం చేసుకోవటం కీలక సమస్య. అక్టోబరు విప్లవానికి కొద్ది నెలల ముందు లెనిన్ రాసిన రాజ్యము – విప్లవం అన్న ప్రసిద్ధ రచనలో దోపిడీ వర్గాల ప్రయోజనాలు కాపాడేందుకు నిర్మితమైన రాజ్యాంగ యంత్రాన్ని పీడిత వర్గాల రాజ్యంలో కూలదోసి దాని స్థానంలో నూతన రాజ్యాంగ యంత్రాన్ని నిర్మించే కర్తవ్యానికి ఉన్న ప్రాధాన్యతను చక్కగా వివరించాడు. 1871లో జరిగిన పారిస్ కమ్యూన్ గురించి మార్క్స్ విశ్లేషణలు, అంచనాల వెలుగులో రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవటం విప్లవ సాధనలో కీలక ప్రాధాన్యత కలిగిన కర్తవ్యంగా మార్చుకున్నాడు. సోషల్ డెమోక్రటిక్ శక్తులతో లెనిన్ తెగతెంపులు చేసుకోవటానికి దారితీసిన వివాదం రాజ్యాంగ యంత్రం గురించిన వివాదమే. సోషల్ డెమోక్రటిక్ శక్తులు పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే సంస్కరణలకు పరిమితమవ్వాలని పిలుపునిచ్చారు.

విశ్వవ్యాపిత ప్రభావం

20వ శతాబ్దం ఆరంభం శక్తివంతమైన సామ్రాజ్యవాద శక్తులు ఆధిపత్యం వహిస్తున్న కాలం. బ్రిటిష్, జర్మన్, ఆస్ట్రో-హంగరీ, రష్యా, జపాన్ సామ్రాజ్యాలు ప్రపంచాన్ని ముక్కలు ముక్కలు చేసి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ఇటలీ, పోర్చుగల్ వంటి చిన్నచిన్న సామ్రాజ్యాలు కూడా ఉన్నాయి. అక్టోబరు విప్లవంతో పాత తరహా వలసవాదానికి తెరపడింది. జార్ సామ్రాజ్యం కూలిపోయిన తర్వాత భూమ్మీద ఏ సామ్రాజ్యమూ బతికి బట్టకట్టలేదు.

అక్టోబరు విప్లవాన్ని విజయపథాన నడిపించిన వ్యూహం – కార్మిక కర్షక ఐక్య సంఘటన – వలస దేశాలు, అర్ధ వలస దేశాల విముక్తి పోరాటాల్లో కీలకమైన వ్యూహంగా మారింది. ఈ వ్యూహాన్ని అమలు జరిపిన విముక్తి పోరాటాలు పుంజుకున్నాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్, అమెరికా దేశాల్లో సాగిన జాతీయ విముక్తి ఉద్యమాలు అక్టోబరు విప్లవ విజయోత్సాహం నుండి స్ఫూర్తిని పొందాయి. మరోవైపున ఆయా దేశాల్లో సాగే విముక్తి పోరాటాలకు విప్లవ రష్యా ఎనలేని సహాయ సహకారాలు అందించింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో సైతం అటు విప్లవ పంథాను అనుసరించిన వారితో పాటు అటు కాంగ్రెస్ శ్రేణుల్లో సైతం రష్యాలో సాధించిన కార్మిక కర్షక ఐక్య సంఘటన పెద్దఎత్తున ప్రభావాన్ని చూపింది.

ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమాలపై కూడా అక్టోబరు విప్లవం గణనీయంగా ప్రభావితం చూపింది. ప్రజాస్వామ్యానికి ప్రథమ శత్రువు ఫాసిజం. ఫాసిజానికి వ్యతిరేకంగా సాగిన ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమంలో సోవియట్ రష్యాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సోషలిస్టులు అద్వితీయమైన త్యాగాలు చేశారు. ఫాసిజానికి వ్యతిరేకంగా సాగిన జీవన్మరణ పోరాటంలో సుమారు రెండున్నర కోట్ల మంది రష్యా పౌరులు సైనికులు ప్రాణాలొడ్డారు.

పశ్చిమార్ధ గోళంలోని సంపన్న దేశాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అమలు జరిపినప్పటికీ ఆర్థికంగా కులీన వర్గాల ఆధిపత్యాన్ని కాపాడుకుంటూ వచ్చాయి. ఈ దేశాల్లో కార్మికవర్గం సైతం సోవియట్ రష్యా స్ఫూర్తిగా సాగించిన కార్మికోద్యమాలు గణనీయమైన విజయాలు సాధించాయి. పెట్టుబడిదారీవర్గం నుండి అనేక రాయితీలు రాబట్టాయి. కేవలం సోవియట్ రష్యా ప్రభావానికి తమ దేశాల్లోని ప్రజలు లోనుకారాదన్న కోరికతోనే పశ్చిమ యూరోప్‌లోని దేశాలు విద్య, వైద్యం, ఉపాధి, పింఛను వంటి ప్రయోజనాలు ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చాయి.

చివరిగా ప్రపంచ వ్యాప్తంగా కార్మికోద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీల ఆవిర్భావానికి పునాదులు వేసింది అక్టోబరు విప్లవమే. చైనా, వియత్నాం, క్యూబా, కొరియా దేశాల విమోచనోద్యమాలకు కావాల్సిన సైద్ధాంతిక, వ్యూహాత్మక పునాదిని వేసింది అక్టోబరు విప్లవం.

వంద సంవత్సరాల తర్వాత అక్టోబరు విప్లవ విజయాలను కించబర్చేందుకు, ఘనకీర్తిని మసకబార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్టోబరు విప్లవం ఒక కుట్రపూరిత ప్రయత్నమని, నియంతృత్వ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సాగిన ప్రయత్నమని నమ్మబలికేందుకు గాను పెద్దఎత్తున చరిత్ర వక్రీకరణ, దుష్ప్రచారం జరుగుతోంది. శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ఆరోపణలు మరింత ఉధృతమయ్యాయి. నవంబరు 7న తన సంపాదకీయంలో గార్డియన్ పత్రిక రష్యాలో అనుసరించిన విధానం ఫలించలేదని నిర్ధారిస్తూ రాసింది. అక్టోబరు విప్లవ స్వభావాన్ని, పర్యవసానాలను వక్రీకరించేందుకు అంత తీవ్రమైన ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి? నేటికీ అక్టోబరు విప్లవం తన ప్రాసంగికతను పదే పదే నిరూపించుకుంటూ ఉంది కాబట్టే దాని కీర్తి ప్రతిష్టలపై బురదజల్లే ఉద్దేశపూర్వక ప్రయత్నాలు జరుగుతున్నాయి. నయాఉదారవాద పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో కూరుకుపోయింది. సామ్రాజ్యవాదం తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఉంది. ఆర్థిక సామాజిక అంతరాలు చరిత్ర కనీవినీ ఎరుగని స్థాయికి పెరిగిపోయాయి. సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. విచక్షణారహితమైన పెట్టుబడిదారీ విధానం అనుసరిస్తున్న ప్రకృతి వనరుల దోపిడీ వల్ల పర్యావరణ ముప్పు వాటిల్లనుంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ మానవాళి ఈ వైఫల్యాలు పరాజయాలతో కునారిల్లనవసరం లేదని, సోషలిజం అనే ప్రత్యామ్నాయం ఉందన్న విషయాన్ని ప్రపంచం దృష్టికి తెస్తుంది అక్టోబరు విప్లవ విజయం.

అక్టోబరు విప్లవం తరహాలో మరో విప్లవం అసాధ్యమన్న విషయాన్ని ఇక్కడ చెప్పాల్సిన అవసరం లేదు. శతాబ్దం తర్వాత, 20వ శతాబ్దంలో ప్రపంచం చవిచూసిన అనేక విప్లవోద్యమాల అనుభవాలను రంగరించుకున్న తర్వాత భవిష్యత్తులో విజయం సాధించబడే ఏ విప్లవమైనా అక్టోబరు విప్లవం సాధించిన విజయాలు, అనుభవాల వెలుగుల్లో పురోగమిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. తమ భవిష్యత్తుకు తామే నిర్మాతలుగా మారిన సాధారణ ప్రజలు, కార్మికులు, రైతాంగం, సైనికులు శక్తి సామర్థ్యాలే అక్టోబరు విప్లవం అజరామరం అని రుజువు చేసే తార్కాణాలు.

/ అక్టోబరు విప్లవ శతజయంతి సందర్భంగా రాసిన వ్యాసానికి పునర్ముద్రణ /

విశ్లేషణ

గిరిజన, గురుకుల, ఆశ్రమ పాఠశాలల గోడు వినరే !



గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలనేది ఆచరణలో జరుగుతున్నదా అనేది పరిశీలిస్తే ఆటంకాలు అనేకం. బడులు లేక, ఉన్నా బడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు కనిపిస్తున్నాయి. తాగునీటిది పెద్ద సమస్య. ఎప్పటికప్పుడు ఆర్.ఓ ప్లాంట్లు మరమ్మతులకు గురికావడం, వాటి కోసం నిధులు కేటాయించక పోవడం. ఇవన్నీ పరిశీలిస్తే గిరిజన విద్య కోసం బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోవడం. దాంతో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు.



కె. విజయగౌరి

అక్షరాస్యతలో బాగా వెనుకబడిన ప్రాంతాలు గిరిజన ప్రాంతాలు. అటువంటి గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 గిరిజనులకు విద్య, రక్షణ, సదుపాయాలు కల్పించాలని పేర్కొంది. 1985 నుండి 1990 వరకు గిరిజనుల విద్య కోసం చేసిన కృషి ప్రశంసించదగ్గది. క్రమేణా ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పి అక్షరాస్యత కోసం, విద్య కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. రాజ్యాంగంలో షెడ్యూల్ తెగలకు ప్రత్యేకమైన రక్షణలు, సదుపాయాలు కల్పించబడ్డాయి. గిరిజనులకు విద్యను అందిస్తూ వారిని అన్ని విధాలా సామాజిక వివక్షతల నుంచి, దోపిడీ నుంచి రక్షించాలని ఆర్టికల్ 46 సూచించింది. 5వ షెడ్యూల్ ద్వారా గిరిజన ప్రాంతాల పరిపాలన గవర్నరుకు ప్రత్యేక బాధ్యతను ఇచ్చింది. 275(1) ప్రకారం షెడ్యూలు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నోడల్ ప్యాకేజీలను ఇవ్వాలని సూచించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు నేటికీ అమలుకు నోచుకోలేదని, బాలారిష్టాలతోనే కొనసాగుతున్నాయని గిరిజన ప్రాంతాలలో జరిగే సంఘటనలే నిరూపిస్తున్నాయి.

మౌలిక వసతులు కీలకం

ఈనాటికీ గిరిజన ప్రాంతాల నుండి ఆసుపత్రికి రావాలంటే డోలీ మోతలు ప్రత్యేక కథనాలుగా చూస్తున్నాము. ఆ ప్రాంత ప్రజలపైగల బాధ్యతా రాహిత్యం విద్యార్థులు చదువుకునే సంక్షేమ గృహాలపై కూడా కొనసాగుతున్నది. పదేళ్ల క్రితం కురుపాం మండలం తుమ్మికమానుగూడకు చెందిన ముగ్గురు విద్యార్థులు టంపలపాడు ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నపుడు తాగునీరు లేక, మరుగుదొడ్లు లేక రోగాల బారినపడి చనిపోయిన ఘటన నుండి తాజాగా కురుపాం మండల కేంద్రంలోగల గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ఘటన వరకు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ఇద్దరు బాలికలు చనిపోవడం, 138 మంది పచ్చ కామెర్లతో ఆసుపత్రిపాలు కావడం సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వ బాధ్యత ఏపాటిదో రుజువు అవుతున్నది.

ఈ ఘటనే కాదు. గిరిజన సంక్షేమ హాస్టళ్ల ఎక్కువ శాతం సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. బాలికల వసతి గృహాలు సరిపడినన్ని లేక కురుపాం గురుకుల పాఠశాలల పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది. పాఠాలు బోధించడానికి, బాలికలు నిద్రించడానికి, సామానులు భద్రపరచడానికి, భోజనాలు చేయడానికి అన్నింటికీ ఒకటే గదులు. 600 పైచిలుకు గల బాలికలకు కేవలం 18 మాత్రమే మరుగుదొడ్లున్నాయి. ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు క్లాసులున్న గురుకులాలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. బాలికల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా ఎ.ఎన్.ఎం లు లేరు. గురుకులాలలో ఉన్నప్పటికీ తగిన మందులు, సౌకర్యాలు కల్పించడంలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు భయపడి ఆందోళనతో స్వంత డబ్బులతో ఆరోగ్య కార్యకర్తలను నియమించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాలకులు మారుతున్నా పరిస్థితులు మారడం లేదు. వార్డెన్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన లేనందున ఉపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు చేపడుతున్నారు. బోధన ఒకవైపు, పిల్లల బాధ్యత మరొకవైపు చూడటం నష్టదాయకంగా ఉంది. వైద్యపరమైన సేవలు అందించడానికి ప్రత్యేకంగా శాశ్వత సిబ్బంది లోపం కూడా విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో మెడికల్ ఖర్చు ముందస్తుగా ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లపై పడుతున్నది.

ఆశ్రమ పాఠశాలలలో ఆయాలు లేరు. గిరిజన ప్రాథమిక పాఠశాలల నుండి 3, 4, 5 తరగతుల పిల్లలను ఆశ్రమ పాఠశాలలకు విలీనం చేసిన తరువాత అంత చిన్నపిల్లల ఆలనా పాలన చూసే ఆయాలు గాని, టీచర్లు గాని ప్రత్యేకంగా లేకపోవడం వలన పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలపై తీవ్ర ప్రభావం చూపి డ్రాపవుట్లుగా మారుతున్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విద్య దోహద పడాలి

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలనేది ఆచరణలో జరుగుతున్నదా అనేది పరిశీలిస్తే ఆటంకాలు అనేకం. బడులు లేక, ఉన్నా బడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు కనిపిస్తున్నాయి. తాగునీటిది పెద్ద సమస్య. ఎప్పటికప్పుడు ఆర్.ఓ ప్లాంట్లు మరమ్మతులకు గురికావడం, వాటి కోసం నిధులు కేటాయించక పోవడం. ఇవన్నీ పరిశీలిస్తే గిరిజన విద్య కోసం బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోవడం. దాంతో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు.

గిరిజన బాలబాలికలకు చదువు, వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మూడవ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వ బాలుర-బాలికల వసతి గృహాలు ప్రారంభించారు. ఎప్పటికప్పుడు మౌలిక వసతులు కల్పించే విషయంలో బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, మరమ్మతులు, వైద్య అవసరాలు, పోషక విలువలతో కూడిన మెనూ చార్జీల పెంపునకు నిధులు వుండాలి. ఈ ఏడాది షెడ్యూల్ తెగల సంక్షేమానికి కేవలం రూ.8,159 కోట్లు మాత్రమే కేటాయించారు. పాఠశాల విద్యకు రూ.31,806 కోట్లు కేటాయించారు. గిరిజన విద్యారంగానికి కేటాయింపులు తక్కువ. ఇటువంటి పరిస్థితులలో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న బాలబాలికలకు ఆరోగ్యం బాలేకపోతే బాధ్యత ఎవరిది? ఇటువంటి పరిస్థితులను ఎవరు చక్కదిద్దుతారో పాలకులే చెప్పాలి.

రాజ్యాంగ పరమైన హక్కులను అమలు చేయకపోవడంతో గిరిజన ప్రాంతాలు వెనుకబడ్డాయి. పేదరికం, దోపిడీ, వెనుకబాటుతనం నుండి విముక్తి జరగాలంటే నేటితరం గిరిజన విద్యార్థులంతా చదువుకోవాలి. సంక్షేమ హాస్టళ్లను ఆశ్రయించే విద్యార్థుల కోసం మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

/వ్యాసకర్త యు.టి.ఎఫ్ సీనియర్ నాయకులు,
సెల్: 8985383255/

★

కవిత్వం

దృశ్యం

పెళ్ళి కోలాహలంతో...
వీధుల్లో వీరంగం
డిజే శబ్దాలతో...
జనుల చెవుల నిండా
కమ్ముకున్న కాలుష్యం
ధగ ధగా మెరుస్తున్న
జ్యూవెలరీ షాపుల్లా...
బంధు జన పరివారం
కదిలి వస్తున్న ఖరీదైన
వస్త్ర దుకాణాలు మాదిరి
అతిథి జనుల సందోహం
కొసరి కొసరి వడ్డింపులు
వయ్యారపు ఆరగింపులు
వ్యర్థంగా
మిగిలిపోతున్న విస్తర్లు
పోగు పడుతున్న
ఎంగిలాకులు
వ్యర్థాల కోసం
ఎగబడుతున్న
పందులు, కుక్కలు
వాటి మధ్య నలుగుతున్న
ఎండిపోయిన డొక్కలు
ఒక వైపు
వెలుగుతున్న భారతం
మరోవైపు
నలుగుతున్న భారతం
అయినప్పటికీ...!
ఏదో ఒక మూల
అరుస్తూనే వుంది
ఊసరవెల్లి రాజకీయం
భారత్ వెలిగిపోతోందని.

- వి. రాజగోపాల్,
విజయనగరం.
సెల్: 9133084262



ఎక్సైజ్ శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి మీనా

విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించం

- ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించే వారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని అధికారులను ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. మంగళగిరిలోని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ కార్యాలయంలో అన్ని జిల్లాల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. ములకల చెరువు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. నేరం జరిగిన సందర్భంలో పాటించాల్సిన సాధారణ ప్రోటోకాల్‌ను అనుసరించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై రాష్ట్ర స్థాయిలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు ప్రతి 15 రోజులకు ఒక పర్యాయం సమీక్ష నిర్వహించాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి సహా మరో 4 జిల్లాల్లో అధికారుల పనితీరుపై ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ సిహెచ్ శ్రీధర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్లు విక్రయాల పరిమాణాలను తరచూ గమనిస్తూ ఉండాలన్నారు. రానున్న రెండు రోజుల్లో ఈ అంశంపై జిల్లా స్థాయిలో పూర్తి సమాచారంతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వివిధ స్థాయిల్లో ఉన్న క్రమశిక్షణ కేసులను విచారించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో విక్రయించే ప్రతి మద్యం సీసాను తప్పనిసరిగా సురక్షా యాప్‌తో స్కాన్ చేయాలని సూచించారు. నవోదయం 2.0 అమలుకు సంబంధించి శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో కొంత బాధ్యతా రాహిత్యం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ దేవ్ కుమార్, సంయుక్త కమిషనర్లు అనసూయాదేవి, నాగలక్ష్మి, అరుణరావు, ఒఎస్‌డి చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌లో తొమ్మిది వామపక్షపార్టీల విలీనం

ఖాట్మండు : నేపాల్‌లో తొమ్మిది వామపక్ష పార్టీలు విలీనమై కొత్త పార్టీని ప్రకటించాయి. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్), సిపిఎన్ (యునిఫైడ్ సోషలిస్టు) సహా మరో ఏడు పార్టీలు నేపాల్ రాజధాని ఖాట్మండులో బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఈ విలీన ప్రకటన చేశాయి. నేపాలీ కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడుతున్నట్లు ప్రకటించాయి. మార్చి ఐదవ తేదిన సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం వెలువడటం గమనార్హం. విలీన ప్రకటనకు ముందు తొమ్మిది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. ఐదు కోణాల నక్షత్రాన్ని ఎన్నికల గుర్తుగా స్వీకరిస్తున్నట్లు నూతనంగా ఏర్పడిన నేపాలీ కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ (ప్రచండ) కొత్త పార్టీకి సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. సిపిఎన్ (యునిఫైడ్ సోషలిస్టు) అధినేత మాధవ్ కుమార్ నేపాల్ సహసమన్వయకర్తగా ఉంటారు. మార్క్సిజం, లెనినిజంను సైద్ధాంతిక మార్గదర్శకంగా తీసుకుంటున్నట్లు బహిరంగ సభలో నేతలు తెలిపారు. రానున్న ఆరు నెలల కాలంలో జాతీయ మహాసభ నిర్వహించి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని ప్రకటించారు. మావోయిస్టు సెంటర్, యునిఫైడ్ సోషలిస్ట్ పార్టీలతో పాటు నేపాల్ సమాజవాది, సిపిఎన్ (సోషలిస్ట్), జనసమాజవాది పార్టీ నేపాల్, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ, సిపిఎన్ (మావోయిస్టు సోషలిస్ట్) సిపిఎన్ సమబాది, దేశభక్త సమాజవాది మోర్చా పార్టీలు ఈ విలీన ప్రకటన చేశాయి.

పిపిపి విధానంలో పర్యాటకాభివృద్ధి

- వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ప్రదర్శనలో మంత్రి దుర్గేష్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో అభివృద్ధి చేస్తున్నామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు. లండన్ పర్యటనలో భాగంగా వరల్డ్ ట్రావెల్ మార్కెట్-2025 ఎగ్జిబిషన్‌కు రెండోరోజైన బుధవారం మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను చూసి సహజ సౌందర్యాలను ఆస్వాదించాలని కోరారు. ఏడాది కాలంలోనే తాము రూ.12 వేలకోట్ల పెట్టుబడులను పర్యాటక రంగంలో ఆకర్షించామని చెప్పారు. పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని తెలిపారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, అన్ని రకాల రాయితీలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సిఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్ర పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించేందుకు ఈ ఎగ్జిబిషన్ చక్కని వేదికగా దోహదపడిందన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎదురుకాల్పులు

- అగ్నివీర్‌కు గాయాలు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో కిస్త్వార్ జిల్లాలో బుధవారం భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పారా ట్రూపర్ (అగ్నివీర్) గాయపడ్డారు. జిల్లాలోని ఛత్రు అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులున్నట్లు సమాచారం అందడంతో భద్రతా బలగాలు 'ఆపరేషన్ ఛత్రు' చేపట్టాయి. సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, కాశ్మీర్ పోలీసులతో కూడిన సంయుక్త బృందాలు బుధవారం తెల్లవారుజాము నుంచే సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాదులున్న ప్రాంతాన్ని గుర్తించి భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. ఈ క్రమంలో పరస్పరం కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఉత్తర ప్రదేశ్ నివాసి అయిన 11ఆర్‌ఆర్‌కు చెందిన పారాట్రూపర్ (అగ్నివీర్) కపిల్ కుమార్‌గా గుర్తించారు. ఆయనను తక్షణమే ఉధమ్‌పుర్‌లోని కమాండ్ హాస్పిటల్‌కు తరలించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. కాగా బుధవారం అర్ధరాత్రి సమయంలోనూ 'ఆపరేషన్ ఛత్రు' కొనసాగినట్లు తెలిసింది.



కోతకు గురైన తీరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

తీరం కోత పరిష్కారానికి చర్యలు

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్, సిటీ


పెద్దగణగళ్లవానిపేటలో నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో తీరం కోతకు గురవుతోందని, దీని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగణగళ్లవానిపేట గ్రామాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.1.40 కోట్లతో నిర్మించనున్న స్టోరేజ్ షెల్టర్ భవనానికి శంకుస్థాపన చేశారు. కోతకు గురవుతున్న తీరాన్ని రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. నాగావళి నది సముద్రంలో కలిసే దిశను మార్చుకుంటూ వెళ్లడం ప్రమాదకరమన్నారు. కోస్టల్ రీసెర్చ్ సెంటర్ ఇచ్చిన సూచనల మేరకు నది దిశ యథావిధిగా ఉంచే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సమాంతరంగా రెండో దశలో ఈ ప్రాంతంలో ఫిషింగ్ జెట్టి కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ఇతర అధికారులు, నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 మేకలు మృతి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం ఇసకలపాలెం గ్రామంలో వీధి కుక్కల దాడిలో కొయ్యాన ఎర్రయ్యకు చెందిన 20 మేకలు బుధవారం మృత్యువాత పడ్డాయి. బాధితుని కథనం ప్రకారం... ఎర్రయ్య సుమారు వంద మేకలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మేకలను మేతకు తీసుకెళ్లి వచ్చాక ఎప్పట్లాగే ఇంటికి సమీపంలోని ప్రాంతంలో వాటిని ఉంచారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఎనిమిది వీధి కుక్కలు మేకల మంద ఉన్న ప్రాంతంలో ప్రవేశించి దాడి చేయడంతో 20 మేకలు మృతి చెందాయి. వీటి విలువ రూ.మూడు లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఎర్రయ్య తెలిపారు. మేకల మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు భారీ నష్టం వాటిల్లిందని భోరున విలపిస్తున్నారు. కుక్కల దాడిలో గాయపడిన మిగిలిన మేకలను పెద్ద సవలాపురం గ్రామ సచివాలయ పశువైద్య అసిస్టెంట్ పరిశీలించారు.

ఎస్‌వియులో ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీ


శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ర్యాగింగ్‌ను అరికట్టకుండా, ర్యాగింగ్ కు మద్దతుగా మాట్లాడిన సైకాలజీ ఆచార్యులు విశ్వనాథరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని, ఇంటరాక్షన్ క్లాసులను రద్దు చేస్తూ ఉప కులపతి వెంటనే సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో-కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ ఎస్‌వియు అధ్యక్షులు నరసన్న, కార్యదర్శి వినోద్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆశ, ఎన్ఎస్‌ఎయ్ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, ఎన్ఎల్ఎస్‌ఏ వ్యవస్థాపకుడు సుందరరాజు, జిఎన్ఎస్ వ్యవస్థాపకుడు శివశంకర్ నాయక్, జేబీఎస్‌ఎఫ్ కన్వీనర్ భార్గవ్ సాయిలు మాట్లాడుతూ వర్సిటీలో సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి స్వయంగా తరగతిలో కూర్చొని సీనియర్ విద్యార్థుల చేత జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయించాడని ఆరోపించారు. అలాంటి ప్రొఫెసర్‌ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించి బాధిత విద్యార్థినులకు న్యాయం చేయాలన్నారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడిన విద్యార్థి సంఘాల నాయకులపై వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు, రెక్టార్ అప్పారావు కలిసి, వర్సిటీకి సంబంధం లేని మోహన్ నాయుడు అనే వ్యక్తి పేరు మీద క్యాంపస్ పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తే పోలీసులు చేత భయపెట్టడం దారుణమని, అక్రమ కేసులు బనాయిస్తే విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు భయపడే ప్రసక్తి లేదని హెచ్చరించారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే పరిపాలన భవనం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన విద్యార్థులకు ధైర్యం నింపుతూ విద్యార్థులు ఐక్యంగా ఉండాలని, ఇంటరాక్షన్ క్లాసుల పేరిట సీనియర్ విద్యార్థుల హాస్టల్ గదులకు వెళ్లొద్దని, వర్సిటీలో ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధిత విద్యార్థినీల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. మా బిడ్డలకు వర్సిటీలో న్యాయం జరగడం లేదని, తప్పు చేసిన ప్రొఫెసర్‌ను యాజమాన్యం కాపాడడానికి ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ ఘటనకు సంబంధించిన టైమింగ్ సిసిటివి ఫుటేజ్‌ని చూపించాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో వర్సిటీ విసి, రిజిస్ట్రార్‌లు సహాయం కోరితే తప్ప పోలీసులకు వర్సిటీలోకి అనుమతి లేదన్నారు. శాంతియుతంగా యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు.

తిరుమలలో వైభవంగా కార్తీక పౌర్ణమి గరుడసేవ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో కార్తీకపౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. బుధవారం రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల్లోనూ వాటాలా!

ప్రజాశక్తి- రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్న ప్రజాప్రతినిధి... వాటిని విస్మరించి అన్నింటా వాటాల కోసం పాకులాడుతున్నారు. చివరకు కోళ్ల వ్యర్థాల అమ్మకాల్లోనూ తలదూర్చారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. తాను సూచించిన ఏజెన్సీకే వ్యర్థాలు అమ్మేలా హడావుడిగా సర్క్యులర్‌ను సైతం జారీ చేయించారు. ప్రస్తుతం రాజానగరం నియోజకవర్గంలో ఏ ఇద్దరున్నా వారి మధ్య కోళ్ల వ్యర్థాలపై చర్చ నడుస్తోంది. రాజానగరం నియోజకవర్గంలో సుమారు 300 వరకూ మాంసం దుకాణాలు ఉన్నాయి. పలు కుటుంబాల వారు, కొంతమంది నిరుద్యోగులు ఇదే వృతిగా చేసుకుని ఉపాధి పొందుతున్నాయి. మాంసం అనంతరం కోళ్ల వ్యర్థాలను కూడా వీరు అమ్ముతున్నారు. తద్వారా ఆయా దుకాణం పరిమితిని బట్టి రోజూ రూ.300 నుంచి రూ.500 వరకూ అదనపు ఆదాయం పొందుతోంది. ఇంతవరకూ బాగానే ఉంది. ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. కోళ్ల వ్యర్థాల అమ్మకాల్లోనూ వాటా కోసం నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కన్నేశారు. ఆయన అనుకున్నదే తడవుగా ఆలోచనను అమల్లో పెట్టారు. కోళ్ల వ్యర్థాల అమ్మకాల కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చారు. గతంలో ఎన్నడూ కోడి మాంసం దుకాణాల వద్ద లభించే వ్యర్థాల అమ్మకాలకు ఆదేశాలు ఇచ్చిన దాఖలాలు లేవు. తొలిసారిగా రాజానగరం ఎంపిడిఒ పేరుతో వచ్చిన సర్కులర్ వివాదాస్పదమైంది. దీనిపై దుకాణదారులు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంలో విషయం బయటకు వచ్చింది.

ఏంటీ సర్క్యులర్

కోళ్ల వ్యర్థాలను గోదావరి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీకి మాత్రమే విక్రయించాలంటూ మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఈ ఏడాది జూన్ రెండున ఎంపిడిఒ ఝాన్సీ సర్క్యులర్ జారీ చేశారు. ఆ ఏజెన్సీ ఒక్కో దుకాణానికి రూ.200 చెల్లించేలా సర్క్యులర్‌లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం లైసెన్స్ ఉన్న వ్యక్తికి మాత్రమే వ్యర్థాలను విక్రయించాలి. సర్క్యులర్‌లో పేర్కొన్న ఏజెన్సీకి లైసెన్స్ ఉందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగానే ఉంది. ఎంపిడిఒ అడ్డగోలుగా ఇచ్చిన ఆదేశాలను మాంసం దుకాణదారులు వ్యతిరేకిస్తూ ఈ నెల 4న పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

దీనిపై ఎంపిడిఒ జెవి.ఝాన్సీని వివరణ కోరగా, ఇప్పటికే నియోజకవర్గంలో సీతానగరం, కోరుకొండ మండలాల్లో వ్యాపారులు గోదావరి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీకి కోళ్ల వ్యర్థాలను విక్రయిస్తున్నారని, అందుకే రాజానగరం మండలంలో కూడా అదే ఏజెన్సీకి ఇచ్చేలా సర్క్యులర్‌ను జారీ చేశామని తెలిపారు. రాజానగరం గ్రామ కార్యదర్శి ప్రసాద్‌ను వివరణ కోరగా, కోడి మాంసం దుకాణాలు వ్యర్థాల అమ్మకాలపై పిజిఆర్ఎస్‌లో అర్జీ వచ్చిందన్నారు.

దుకాణదారుల ఆగ్రహం

ఈ సర్క్యులర్‌పై మాంసం దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ దుకాణాల్లో వ్యర్థాలను తాము ఇష్టం వచ్చిన వ్యాపారికి అమ్ముకునే వీలుండేదన్నారు. ఈ సర్క్యులర్ వల్ల తక్కువ ధరకే వ్యర్థాలను అమ్ముకోవాల్సి వస్తుందని, దీనివల్ల తాము నష్టపోతున్నామని తెలిపారు. ఎన్నడూ లేనిది ఇక్కడ సర్క్యులర్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై పిజిఆర్ఎస్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. వెంటనే ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

రూ. 90వేల నగదు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-బత్తలపల్లి

జల్సాలు, చెడు వ్యసనాలకు బానిసలై వాటిని తీర్చుకోవడానికి అవసరమైన డబ్బు కోసం చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు ధర్మవరం డిఎస్‌పి బి.హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం డిఎస్‌పి ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్‌తో కలిసి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బత్తలపల్లిలోని విజయచౌదరి కాలనీకి చెందిన ముల్లగూరు అయ్యప్ప గత మార్చి 8న ధర్మవరం రోడ్డులో నిల్చొని ఉండగా బైక్‌పై వెళుతున్న ఓ యువకుడు కిందపడిపోతుండగా సాయం చేయబోయాడు. ఆ సమయంలో ఆ యువకుడు జేబులో నుంచి సెల్‌ఫోన్ దొంగలించి ఫోన్ పే ద్వారా రూ. 1,82,000 ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో డిఎస్‌పి హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో రూరల్ సిఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఓ టీంను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌ను గత నెల 1వ తేదీ అదుపులోకి తీసుకుని విచారించగా మరో ముగ్గురితో కలిసి నేరం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు అతడి నుంచి రూ. 20వేలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ముగ్గురిలో చిత్తూరు జిల్లా మంగసముద్రంకు చెందిన మేకల లోకేష్, తోట రాకేష్ అలియాస్ చిన్న యేసు, తోట ఇమాన్యుయల్‌గా గుర్తించారు. వీరిని బుధవారం అనంతపురం-కదిరి జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్యన్ డాబా ముందు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి ఓ బైక్, రూ. 70వేలు స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. వీరిని ధర్మవరం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. నిందితులను గుర్తించడంలో సిసి కెమెరాలు కీలకంగా మారినట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ సుదర్శన్ నాయుడు, అనిల్‌కుమార్‌కు రివార్డు అందజేశారు.

పంటలపై జంట ఏనుగుల దాడులు

ప్రజాశక్తి- రామకుప్పం

చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన పులిమడుగు తండాలో జంట ఏనుగులు మంగళవారం రాత్రి పంటలపై దాడులు చేశాయి. అర్ధరాత్రి గ్రామంలోని చంద్రశేఖర్ నాయక్, కృష్ణా నాయక్‌కు చెందిన వరి పంటలపై పడి తిన్నంత తిని, తొక్కి ధ్వంసం చేసి వెళ్లాయి. దీంతో సుమారు రూ.75 వేలు మేర పంటనష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. కోత దశకు వచ్చిన వరి పంటలను ఏనుగులు నాశనం చేస్తుండటంపై బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు తిని రుచి మరిగితే మళ్ళీమళ్ళీ ఏనుగులు గ్రామాల వైపు వస్తాయని రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి తమకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరాం

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆరుగురి ముఠా సభ్యులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. బుధవారం ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రొద్దుటూరు డిఎస్‌పి భావన, సిఐలు సదాశివయ్య, నాగభూషణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బెంగళూరు కేంద్రంగా ఈ ముఠా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారని తెలిపారు.

దేశవ్యాప్తంగా పెరిగిన వాయు కాలుష్యం !

- అక్టోబరు నెలపై సిఆర్ఇఎ నివేదిక
- ఆరవ స్థానంలో దేశ రాజధాని



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా గాలి నాణ్యత అక్టోబరు మాసంలో గణనీయంగా క్షీణించింది. ఇండో-గంగా మైదాన ప్రాంతం ముఖ్యంగా జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) దేశంలోకెల్లా అత్యంత కలుషితమైన జోన్‌గా నిలిచింది. హర్యానాలోని దారుహెరా ప్రాంతం పిఎం2.5తో, నెలవారీ సగటు 123గా ఈ జాబితాలో తొలి స్థానంలో నిలిచి, జాతీయ సురక్షితా హద్దును కూడా ఉల్లంఘించింది. ఈ మాసంలోనే 'అత్యంత పేలవమైన', 'తీవ్రమైన' గాలి నాణ్యత కలిగిన రోజులు వరుసగా 9, 2గా నమోదయ్యాయని ఫిన్లాండ్‌కు చెందిన ఎన్‌జిఒ సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సిఆర్ఇఎ) తెలిపింది.

వాయు కాలుష్యంలో ఢిల్లీ ఆరవ స్థానంలో నిలిచింది. సెప్టెంబరులో పిఎం 2.5 లెవల్స్ 36గా వుండగా, అక్టోబరులో మూడింతలు పెరిగి 107కి చేరుకుంది. ఇప్పటికే నెలకొన్న కాలుష్యానికి గడ్డివాములు తగలబెట్టడం వల్ల తలెత్తే కాలుష్యం మరో ఆరు శాతం మేరకు తోడైంది.

శీతాకాలం, పండుగ సీజన్‌లు దేశంలో కాలుష్య సమస్యను సృష్టించవు, ఆ కాలుష్యం స్థాయిని బహిర్గతం చేస్తాయి. ఏడాది మొత్తంగా ప్రమాదకరమైన స్థాయిలో వుండే కాలుష్య స్థాయిలను ఈ సీజన్లు మరికొంచెం మాత్రమే పెంచుతాయని సిఆర్ఇఎ నివేదిక పేర్కొంది.

స్పష్టమైన పరిష్కార మార్గాలతో రంగాలవారీగా కాలుష్యాలను తగ్గించడానికి మనం ప్రాధాన్యతనిచ్చినట్లైతే ఈ పెంపును మనం తగ్గించగలుగుతామని ఆ నివేదిక సూచించింది. అలా కాకుండా విధానపరమైన ప్రతిస్పందనలు కాలానుగుణంగా అమలు కావడంతో ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నాయని సిఆర్ఇఎ విశ్లేషకుడు మనోజ్ కుమార్ వ్యాఖ్యానించారు.

దీనికి విరుద్ధంగా ముంబయి మహా నగరంలో పిఎం 2.5 స్థాయి 40గా వుండడంతో అది సంతృప్తి కేటగిరీలో వుంది. అయితే నగరంలోని పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం పలు రకాలుగా మారుతూ వస్తోంది.


మొత్తంగా తగిన డేటాతో 249 నగరాలను పరిశీలించగా, 212 నగరాలు జాతీయ వాయు కాలుష్య ప్రామాణికాల పరిధి (ఎన్ఎఎక్యుఎస్)లోనే వున్నాయని తేలింది. ఆరు నగరాలు మాత్రం ప్రపంచ ఆరోగ్య సంస్థ విధించిన రోజువారీ సురక్షిత మార్గదర్శకమైన 15పాయింట్ల పరిధిలోపలే వున్నాయి. సెప్టెంబరు మాసంలో 179 నగరాలు మంచి వాయు నాణ్యతను నమోదు చేయగా, అక్టోబరు వచ్చేసరికి ఆ సంఖ్య 68కి పడిపోయింది. అదే సమయంలో సంతృప్తకర కేటగిరీలో వున్న నగరాల సంఖ్య144కి పెరిగింది. పేలవమైన రికార్డు ప్రదర్శించిన నగరాలు 9 కాగా, 27 నగరాలు ఒక మోస్తరు కేటగిరీలో వున్నాయి. హర్యానాలోని దారుహెరా ఒక్కటే అత్యంత పేలవమైన కేటగిరీలో వుంది.

వాయుకాలుష్య నియంత్రణకు సాయం చేస్తాం : చైనా

న్యూఢిల్లీ : దేశంలో వాయుకాలుష్య తీవ్ర పెరుగుతున్న సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకువచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసి అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు."చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాంటి సమస్యను ఎదుర్కొంటున్నవారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం" అని యూజింగ్ తెలిపారు. పొగమంచుతో తీవ్రంగా ఇబ్బందిపడిన చైనా.. గాలి నాణ్యతను మెరుగుపర్చుకొనే క్రమంలో గణనీయమైన విజయాలు సాధించింది. గతంలో చైనాలో కూడా రాజధాని బీజింగ్‌తో పాటు పలు నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించింది. అయితే అక్కడి ప్రభుత్వం వెంటనే మేల్కొని గట్టి నియంత్రణ చర్యలు తీసుకోవడంతో చైనా మహానగరాల్లో కాలుష్య మేఘాలు చెదిరిపోయాయి. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో శుభ్రమైన గాలి వీస్తోంది.

దేశంలో కూడా వాయు కాలుష్య నియంత్రణకు ఇదేస్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటేే పరిస్థితి మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కర్బన ఉద్గారాలకు, కాలుష్యానికి ప్రధాన కారణాలు విద్యుదుత్పాదన, రవాణా రంగాలే. అందుకే చైనా వేగంగా పునరుత్పాదక ఇంధనాలకు మారుతోంది. విద్యుత్ వాహనాలు, పవన, సౌర విద్యుదుత్పత్తిపై భారీగా పెట్టుబడులు పెట్టింది. వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్నప్పుడు కాలుష్యకారక కర్మాగారాలను తాత్కాలికంగా మూసివేసింది. కొన్నింటిని పట్టణాలు, నగరాలకు దూరంగా తరలించింది. ఇలాంటి చర్యల ద్వారా పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచింది. వాయు, జల కాలుష్యం ప్రజారోగ్యానికి చేటు తెస్తాయి. దీన్ని అధిగమించడానికి చైనా తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. చైనా విజయాన్ని పరిశీలించి భారతదేశ పరిస్థితులకు, సవాళ్లకు అనుగుణమైన విధానాన్ని రూపొందించి అమలుచేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యోగాల కోసం ఓటు వేయండి : అఖిలేష్ యాదవ్



నవాడా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్‌జెడికి మద్దతుగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రచారం చేశారు. బుధవారం నవాడాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 'బీహార్ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలి. మీ ఓటు ఉద్యోగ్యాల కోసం వేయాలి. కొత్త తరం తేజస్వికి మద్దతు ఇవ్వాలి అని ప్రజలను కోరారు. బిజెపి తరపున ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యోగి చెప్పినవి నమ్మకండి అని అఖిలేష్ ప్రజలకు సూచించారు. యోగిని నమ్మవద్దు.. ఆయన యోగిగా ఉన్నప్పటికీ అన్ని అబద్ధాలే చెబుతారు. ఒక శాతంగా ఉన్న సంపద ఇప్పుడు 62 శాతానికి పెరిగింది. రైతులకు డబ్బులు చెల్లించలేని, యువతకు ఉద్యోగాలు కల్పించలేని వారు ఓటు అడిగేందుకు ఇక్కడిక వస్తారా? అని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. వారు యుపిలో ఓడిపోయారు. యుపి ప్రజలు వారిని తిరస్కరించారు. మొదట అవధ్‌లో ఓడిపోయారు. ఇప్పుడు బీహార్‌లోని మగధ్‌లో కూడా ఓడిపోతారు. ఉపాధి, యువత సాధికారతలో సానుకూల పరివర్తన కోసం తేజస్వియాదవ్‌కు మద్దతు ఇవ్వాలని అఖిలేష్ యాదవ్ ఓటర్లను కోరారు.

ఎస్ఐఆర్‌పై చట్టపరంగా పోరాటం

- కేరళ అఖిల పక్ష సమావేశంలో నిర్ణయం

తిరువనంతపురం : ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చట్టపరంగా పోరాటం చేయాలని కేరళలో బుధవారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించాలని సమావేశంలో నిర్ణయం చేశారు. బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయానికి మద్దతు ప్రకటించాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎస్ఐఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఈ ఆన్‌లైన్ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్నందున, దీనికి సంబంధించి న్యాయ సలహా తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల నుండి నవీకరించబడిన ఓటర్ల జాబితా ఇప్పటికే అమలులో ఉన్నప్పుడు, మళ్లీ 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్ఐఆర్ ప్రక్రియతో దీన్ని సవరించడం "అశాస్త్రీయం", "దుర్మార్గపు ఉద్దేశ్యం" కలిగి ఉందని విజయన్ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడు విడి సతీశన్ ముఖ్యమంత్రి వైఖరితో ఏకీభవిస్తున్నట్లు ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. 2002 జాబితాను ఆధారంగా ఎస్ఐఆర్‌ను నిర్వహించడంలో ఉన్న ఇబ్బందులను ఇతర నాయకులు ప్రస్తావించారు. కాగా, కేరళ శాసనసభ ఇప్పటికే ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది.

అమెరికాలో వలసదారుల కష్టాలపై సమాజం పునరాలోచించాలి !

- పోప్ లియో విజ్ఞప్తి

వాషింగ్టన్ : అమెరికాలో నిర్బంధంలో మగ్గిపోతున్న వలసదారుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఈ సమాజం పునరాలోచించాలని పోప్ లియో విజ్ఞప్తి చేశారు. ఏళ్ళ తరబడి ఇక్కడ జీవించిన వీరు, ఎన్నడూ ఎలాంటి సమస్యలకు కారకులు కాని వీరు, ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న దానితో తీవ్రంగా ప్రభావితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో విలేకరులు అడిగిన పలు భౌగోళిక, రాజకీయ ప్రశ్నలపై ఆయన స్పందించారు. 'మీరు విదేశీయుడిని ఎలా స్వాగతిస్తున్నారు, ఆ వ్యక్తికి స్వాగతం చెబుతున్నారా లేదా? ఏం జరుగుతుందో దానిపై మనం లోతుగా పరిశీలించుకోవాల్సి వుందని నేను భావిస్తున్నాను." అని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే నిర్బంధంలో వున్న ప్రజల ఆధ్యాత్మిక హక్కుల గురించి కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. చాలాసార్లు వారు వారి కుటుంబాల నుండి వేరుపడి వుంటారు. ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు, కానీ వారి ఆధ్యాత్మిక అవసరాలను కూడా పరిగణించాల్సి వుందని అన్నారు. ఇమ్మిగ్రెంట్ల తరపున, వారికోసం పని చేయాల్సిందిగా గత నెల్లో పోప్, కార్మిక సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు.

పశ్చిమాసియా పరిణామాలపై కూడా పోప్ స్పందించారు. తొలి దశ ఒప్పందం సక్రమంగా అమలు కావడం లేదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో గాజాను ఎవరు పాలించాలి, ఎలా పాలించాలనే విషయమై సంబంధిత పక్షాలు ఒక అంగీకారానికి రావడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల హక్కులకు మీరు ఎలా హామీ కల్పిస్తారని ప్రశ్నించారు. వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సెటిలర్ల దాడుల గురించి ప్రశ్నించగా అవి చాలా సంక్లిష్టమైనవన్నారు. ప్రజలందరికీ న్యాయం జరిగేలా చూసేందుకు మనందరం కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపిచ్చారు.

గురువారం పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో వాటికన్ సిటీలో పోప్ భేటీ కానున్నారు.

తుపాన్‌తో కరువు మాఫ్

(మొదటిపేజీ తరువాయి)

డ్రైస్పెల్ ఉంది. వర్షానికి వర్షానికి మధ్య మూడు వారాలు, అంతకంటే ఎక్కువ అంతరం ఏర్పడితే డ్రైస్పెల్‌గా పేర్కొంటారు. పంటలు సాగైనా డ్రైస్పెల్ నెలకొంటే పైకి ఎదగవు. ఎండిపోతాయి. దిగుబడి పడిపోతుంది.

నెలలవారీగా పరిస్థితి

జూన్‌లో సాధారణ వర్షంలో 22.4 శాతం తక్కువ నమోదైంది. నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అత్యల్పస్థాయి (స్కాంటీ), మరో 12 జిల్లాల్లో తక్కువ స్థాయిలో వానలు పడ్డాయి. మండలాల దగ్గరకొస్తే 153 స్కాంటీ, 235 మండలాల్లో తక్కువ వర్షం.. వెరసి 388 మండలాల్లో మైనస్ వర్షపాతం నమోదైంది. జూలైలో 26.5 శాతం తక్కువ వర్షం పడింది. తక్కువ వర్షం కురిసిన జిల్లాలు 14, అత్యల్పస్థాయి వర్షం 82 మండలాలు, తక్కువ వర్షం 291 మండలాలు... వెరసి 373 మండలాల్లో సరిగ్గా వానలు కురవలేదు. ఆ నెలలో 284 డ్రైస్పెల్ మండలాలను గుర్తించారు. ఆగస్టులో పరిస్థితి కొంత మెరుపడింది. సగటున రాష్ట్రంలో 25.6 శాతం ఎక్కువ వర్షం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లానే తక్కువ వర్షం కేటగిరీలో ఉంది. తగినంత వర్షం పడని మండలాలు 78, డ్రైస్పెల్ మండలాలు 310. సెప్టెంబర్‌లో 2.4 శాతం అధిక వర్షం పడింది. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, బాపట్ల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తక్కువ వర్షం కురిసింది. తగినంత వర్షం పడని మండలాలు 215 కాగా మొత్తం డ్రైస్పెల్ మండలాలు 342. ఒక్క ఎన్‌టిఆర్ తప్ప తతిమ్మా జిల్లాల్లో ఒకటో రెండో డ్రైస్పెల్ మండలాలున్నాయి. కడపలో 35 డ్రైస్పెల్ మండలాలుండగా ఒక్క మండలాన్నీ ప్రకటించలేదు. అటువంటి జిల్లాలు అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, శ్రీకాకుళం తిరుపతి, పల్నాడు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పంటల సాగు ఐదు లక్షల ఎకరాల్లో లేదు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో 35 శాతం, శ్రీసత్యసాయి, కడపలో 57 శాతం మేర పంటలు సాగయ్యాయి.

ఇక ప్రీ పెయిడ్ మీటర్లు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లను అమర్చే పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇవి ఛార్జింగ్ స్టేషన్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జాతీయ రహదారుల్లో విద్యుత్ వాహన వినియోగదారుల సౌకర్యార్థం ఎపి ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వెహికల్ (ఇవి) ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలోని జిల్లాల్లో జాతీయ రహదారి పక్కన ఉన్న సబ్-స్టేషన్ల ప్రాంగణంలో ఇవి ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఎస్ఇలను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇవి ఛార్జింగ్ స్టేషన్లను పరిశీలించి అధ్యయనం చేయాలని సూచించారు. సబ్-స్టేషన్లతోపాటు ప్రభుత్వ స్థలాలు, ఆస్పత్రులు తదితర ప్రాంతాలను కూడా పరిశీలించాలన్నారు. ఈ అంశంపై వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ జె.రమణాదేవి, తొమ్మిది జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లు చంద్రశేఖర్‌రావు, ఇస్మాయిల్ ఆహ్మద్, రాఘవేంద్ర, శేషాద్రిశేఖర్, రమణ, ప్రదీప్‌కుమార్, సుధాకర్, సంపత్ కుమార్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

హామీలు కాదు... కార్యాచరణ అవసరం

- వాతావరణ మార్పులపై లూలా

బెలెమ్/సావో పాలో (బ్రెజిల్) : ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై ఈ నెలలో అమెజాన్‌లో జరగబోయే సదస్సు (కాప్30) గ్లోబల్ వార్మింగ్‌కు వాస్తవ పరిష్కారాలు సూచిస్తుందని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా తెలిపారు. సదస్సు సందర్భంగా ఆయన అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దశాబ్ద కాలం క్రితం కుదుర్చుకున్న పారిస్ ఒప్పందం ప్రకారం గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్ దాటనీయరాదని పలు దేశాలు లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. అయినప్పటికీ ఇప్పుడది 2.3-2.5 సెల్సియస్ డిగ్రీలుగా నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కర్బన్ ఉద్గారాలు చాలా అధికంగా ఉన్నాయని, గ్లోబల్ వార్మింగ్‌ను అడ్డుకోవడం సాధ్యం కావడం లేదని ఐరాస హెచ్చరించింది.

ఉద్గారాలను తగ్గించుకుంటామని ఇచ్చిన హామీని వివిధ దేశాలు నెరవేర్చాల్సి ఉంటుందని, లేనిపక్షంలో ప్రపంచం మరింత వేడెక్కుతుందని, దానిని తిరిగి సాధారణ స్థితికి తేవడం చాలా కష్టమని యూఎన్‌ఈపీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో లూలా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ నెల 10-21 తేదీల మధ్య బ్రెజిల్‌లో కాప్30 జరుగుతుంది. వాతావరణ మార్పులపై కొత్తగా హామీలు ఇవ్వడానికి బదులు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంపై దృష్టి సారించాలని లూలా ప్రపంచ దేశాలకు సూచించారు. పారిస్ ఒప్పందానికి కొన్ని దేశాలు కట్టుబడి ఉండడం లేదని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో వాతావరణ సదస్సు ప్రాధాన్యతను కోల్పోతుందని లూలా అన్నారు.

అమెరికాలో కూలిన కార్గో విమానం

- ముగ్గురి మృతి

లూయిస్‌విల్లే : అమెరికా లోని లూయిస్‌విల్లెలో విమానం కూలిపోయింది. టేకాఫ్ సమయంలో యూపీఎస్ కార్గో విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా.. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. యూపీఎస్ ఫ్లైట్ నంబర్ 2976 విమానం హొనులులుకు సాయంత్రం (అమెరికా కాలమానం) 5.15కు బయల్దేరగా ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ధ్రువీకరించింది.

విమానం గాల్లోకి ఎగురుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగసి కుప్పకూలిపోయింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విమానం మెక్‌డోనెల్ డగ్లస్ ఎండీ-11 రకానికి చెందినదని ఎయిర్‌పోర్టు అధికారులు ధ్రువీకరించారు.

మినిట్‌మ్యాన్ క్షిపణి ప్రయోగం

- అమెరికా వైమానిక దళానికి చెందిన గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ పరీక్ష

కాలిఫోర్నియా.: అమెరికా వైమానిక దళానికి చెందిన గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ కాలిఫోర్నియా నుంచి నిరాయుధ మినిట్‌మ్యాన్ 3ను ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం)ను పరీక్షించింది. ఇది ఒక సాధారణ పరీక్ష. ఆ క్షిపణి మార్షల్ దీవులకు సమీపంలోని రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ పరీక్షా స్థలంలో పడింది. అధ్యక్షుడు ట్రంప్ అణ్వాయుధాలపై చేసిన వ్యాఖ్యల తర్వాత ఈ పరీక్ష నిర్వహించటం గమనార్హం. మినిట్‌మ్యాన్ 3 క్షిపణి పాతదే కాని శక్తివంతమైనదని అధికారులు ధ్రువీకరించారు. ఇది 1970ల నుండి వాడుకలో ఉంది. ఇది 13వేల కిలోమీటర్ల పరిధి వరకూ గురిపెట్టవచ్చు.దీంతోపాటు అణు వార్‌హెడ్‌ను మోసుకెళ్లగల సామర్థ్యం ఉన్నదని తెలిపారు.

అమెరికా వద్ద దాదాపు 400 ఇలాంటి క్షిపణులు ఉన్నాయి, "మినిట్‌మ్యాన్" అని ఎందుకు పిలుస్తారంటే.. ఇది ఒక్క నిమిషంలో సిద్ధంగా ఉంటుంది. 2030 నాటికి దీన్ని కొత్త క్షిపణితో భర్తీ చేయాలని అమెరికా యోచిస్తోంది, కానీ అప్పటి వరకు, ఈ పరీక్షలు కొనసాగుతాయి.

యుపిలో రైలు ప్రమాదం

ఆరుగురు మహిళలు మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని మిర్జాపూర్‌లో బుధవారం రైల్వే పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు మహిళలు మృతి చెందారు. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో యాత్రికులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాత్రికులు చోపాన్-ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వారు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం పైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాక్ పైకి వచ్చిన హౌరా-కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

పెరుగుతున్న ప్రత్యక్ష నగదు బదిలీలు

- ఖాళీ అవుతున్న రాష్ట్రాల ఖజానాలు
- రెవెన్యూ లోటుతో తప్పని ఇబ్బందులు

న్యూఢిల్లీ : దేశంలోని అనేక రాష్ట్రాలు సంక్షేమ పథకాల అమలు కోసం మహిళల బ్యాంక్ ఖాతాల్లో ప్రత్యక్ష నగదు బదిలీలు చేస్తున్నాయి. 2022-23లో కేవలం రెండు రాష్ట్రాలు మాత్రమే ఈ విధంగా నగదు బదిలీలు చేసేవి. ఇప్పుడు వాటి సంఖ్య 12కు చేరింది. ఈ ఏడాది మహిళల బ్యాంక్ ఖాతాల్లో రూ.1,68,050 కోట్లు జమ చేయాలని ఆయా రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఇది జీడీపీలో 0.5 శాతానికి సమానమని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ సంస్థ తెలిపింది. రెండు సంవత్సరాల క్రితం ఇది 0.2 శాతం కంటే తక్కువగానే ఉంది. కర్నాటకలో గృహలక్ష్మి కానివ్వండి...మధ్యప్రదేశ్‌లో లడ్లీ బెహనా కానివ్వండి...మహారాష్ట్రలో లడ్కీ బెహిన్ కానివ్వండి..బీహార్‌లో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కానివ్వండి...పథకం పేరు ఏదైనా, పాలక పార్టీ ఏదైనా ఎన్నికలకు ముందు ఓటర్లను త్వరగా ప్రసన్నం చేసుకోవడానికి, తమ వైపు తిప్పుకోవడానికి నగదు బదిలీలను అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర ఖజానా గుల్ల అవుతున్నప్పటికీ లబ్దిదారులు మాత్రం సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బేషరతు నగదు బదిలీ పథకాల అమలులో జార్ఖండ్ మొదటి స్థానంలో ఉంది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగాల్సిన అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఈ పథకాలకు నిధుల కేటాయింపు పెంచాయి. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన అంచనాలతో పోలిస్తే అస్సాం ప్రభుత్వం కేటాయింపులను 31 శాతం, బెంగాల్ ప్రభుత్వం 15 శాతం పెంచేశాయి. జార్ఖండ్‌లో సీఎం మయాన్ సమ్మాన్ యోజన పథకం కింద ఇస్తున్న నెలసరి మొత్తాన్ని వెయ్యి రూపాయల నుంచి రెండున్నర వేల రూపాయలకు పెంచారు. ఖజానా ఖాళీ అవుతుండడంతో కొన్ని రాష్ట్రాలు నగదు బదిలీ పథకాలను అటకెక్కించాయి. కొన్నింటిలో కోత పెట్టాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో సీఎం లడ్కీ బహిన్ యోజన కింద నెలకు ఇస్తున్న రూ.1,500లను రూ.500కు తగ్గించారు.

తొలుత ఒడిషాలో రైతులకు అమలు చేసిన నగదు బదిలీ పథకం ఇప్పుడు దేశమంతటా క్రమేపీ విస్తరిస్తోంది. సబ్సిడీలు, వ్యవసాయ రుణాల మాఫీలు, నగదు బదిలీలపై ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆర్‌బీఐ హెచ్చరికలు జారీ చేసింది. నగదు బదిలీ పథకాలను అమలు చేస్తున్న 12 రాష్ట్రాలలో ఆరు రాష్ట్రాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు తప్పదని అంచనా. మిగులు రెవెన్యూ కలిగిన కర్నాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు నగదు బదిలీ పథకాలను అమలు చేస్తూ లోటును ఎదుర్కొంటున్నాయి.

నవ శకానికి స్వాగతం !

విజయోత్సవ ప్రసంగంలో నెహ్రూ మాటలు గుర్తు చేసుకున్న మమ్దానీ



న్యూయార్క్ : మేయర్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మద్దతుదారులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మమ్దానీ, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాటలను గుర్తు చేసుకున్నారు. నవ శకానికి స్వాగతం పలుకుతున్నామంటూ ఆనాడు నెహ్రూ చేసిన వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. నవశకం వైపు అడుగువేసినప్పుడు. ఒక శకం ముగిసినప్పుడు.. సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి నుంచి గళం వినిపించినప్పుడు.. చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ తీర్పు మార్పుకు సంకేతమన్నారు. భవిష్యత్తు మన చేతుల్లో వుందన్నారు. 'మిత్రులారా...మనం ఒక రాజకీయ రాజవంశాన్ని కూలదోశామని మమ్దానీ వ్యాఖ్యానించారు. ట్రంప్ మోసం చేసిన ఈ దేశానికి ఆయనను ఎలా ఓడించాలో చూపించాలంటే అది ఆయనను పెంచి పోషించిన ఈ నగరమేనని అన్నారు. క్యూమో వ్యక్తిగత జీవితం బాగుండాలని మాత్రమే నేను కోరుకుంటున్నానని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని న్యూయార్క్ వాసులు భావించినందునే తాను ఈ విజయం సాధించానని చెప్పారు. డెమొక్రటిక్ ప్రైమరీ ఎన్నికలలో క్యూమోను మమ్దానీ ఓడించిన విషయం తెలిసిందే. అనేక మంది ప్రముఖులు క్యూమోను సమర్ధించినా చివరకు ఆయనకు ఓటమి తప్పలేదు. ఎన్నికలకు ముందు క్యూమోకు ట్రంప్ బహిరంగంగా మద్దతు ప్రకటించారు. 'మీరు ఇదంతా చూస్తున్నారని నాకు తెలుసు. నేను మీకు నాలుగు మాటలు చెప్పాలని అనుకుంటున్నా. వాల్యూమ్ పెంచండి' అని ట్రంప్‌ను ఉద్దేశించి మమ్దానీ చురకలు వేశారు.

చెరిగిపోయిన రికార్డులు

న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన మమ్దానీ తన విజయంతో అనేక రికార్డులను చెరిపేశారు. 1892 తర్వాత నగర మేయర్‌గా ఎన్నికైన పిన్న వయస్కుడు ఆయనే. తొలి ముస్లిం మేయర్, ఆఫ్రికాలో జన్మించి అమెరికా నగరానికి మేయర్ అయిన తొలి వ్యక్తి కూడా ఆయనే. క్వీన్స్ అసెంబ్లీ సభ్యుడైన 34 సంవత్సరాల మమ్దానీ గత సంవత్సరమే మేయర్ రేసులో అడుగు పెట్టారు. అప్పుడు ఆయనకు పెద్దగా గుర్తింపు కూడా లేదు. ధన బలమూ తక్కువే. పార్టీ మద్దతు కూడా లేదు. అయినప్పటికీ మాజీ గవర్నర్ క్యూమో, రిపబ్లికన్ అభ్యర్థి లిండ్సేలను మట్టి కరిపించారు.

వామపక్ష నాయకత్వ లక్షణాలు

అన్నింటికంటే ముఖ్యంగా డెమొక్రటిక్ పార్టీలోని చాలా మంది కోరుకుంటున్న నాయకత్వ లక్షణాలు ఆయనలో కన్పించాయి. వివిధ అంశాలపై సామాజిక మాధ్యమాలలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు పలువురిని ఆకర్షించాయి. చిన్నారులను ఉచితంగా సంరక్షించాలని, ప్రజా రవాణాను విస్తరించాలని, స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేస్తుండగా వాటిని మమ్దానీ గట్టిగా సమర్ధించారు. డెమొక్రటిక్ పార్టీకి ఇటీవలి కాలంలో దూరమైన శ్రామిక ఓటర్లను తిరిగి సొంతగూటికి రప్పించడంలో ఆయన విజయం సాధించారు. వారు ఎదుర్కొంటున్న ప్రధాన ఆర్థిక సమస్యలపై దృష్టి సారించారు. వామపక్షాల సాంస్కృతిక విలువలను ఆయన ఎన్నడూ తిరస్కరించలేదు.

ట్రంప్‌తో కలిసి పనిచేస్తా

ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్ స్థానంలో మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా బాధ్యతలు చేపడతారు. మేయర్ పదవికి తిరిగి పోటీ చేయరాదని సెప్టెంబరులో ఆడమ్స్ నిర్ణయించుకున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో మమ్దానీ, ట్రంప్ మధ్య పరోక్ష యుద్ధం సాగింది. మమ్దానీని ట్రంప్ పదే పదే కమ్యూనిస్టు వెర్రివాడు అంటూ తూలనాడారు. మమ్దానీ ఎన్నికైతే విపత్తు సంభవిస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. కానీ మమ్దానీ మాత్రం ఎక్కడా ట్రంప్‌పై వ్యక్తిగత విమర్శలు చేయలేదు. న్యూయార్క్ ప్రజల క్షేమం కోసం దేశాధ్యక్షుడితో కలిసి పనిచేస్తానని తెలిపారు. అయితే న్యూయార్క్ ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం పోరాడతానని స్పష్టం చేశారు.

అందుకే ఓడాం : ట్రంప్

తాజాగా మమ్దానీ విజయంపై ట్రంప్ స్పందించారు. 'నేను బ్యాలెట్ పేపరులో లేను. ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోంది. రిపబ్లికన్ పార్టీ ఓటమికి ఈ రెండూ కారణాలే' అని ఆయన చెప్పుకొచ్చారు.

హర్యానాలో 25 లక్షల ఫేక్ ఓట్లు


(మొదటిపేజీ తరువాయి)

తొలగించడం లేదని ప్రశ్నించారు. ఎందుకంటే అలా చేస్తే, అది నిష్పాక్షికమైన ఎన్నికలకు అవకాశం ఉంటుందని, అయితే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికమైన ఎన్నికలను కోరుకోవటం లేదని విమర్శించారు. నిరాశ్రయులైన వారికి సున్నా నంబర్ ఇంటిని ఇస్తామని, సున్నా నంబర్ ఇళ్ల వాస్తవం అదేనని సిఈసి జ్ఞానేష్ కుమార్ చెబుతున్నారని, అయితే ఆయన దేశ ప్రజలకు "అబద్ధం" చెబుతున్నారని విమర్శించారు.

హర్యానా ఫేక్ ఓటర్ల జాబితాలో బ్రెజిల్ దేశ మోడల్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. రాయ్‌లోని 10 పోలింగ్ బూత్‌ల్లో ఆ మోడల్ సుమారు 22 సార్లు ఓటు వేసినట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ మోడల్‌కు చెందిన అఫీషియల్ సోషల్ మీడియా పేజీని కూడా చూపించారు. ఆమెకు సీమా, స్వీటీ, సరస్వతి వంటి పేర్లను ఉపయోగించారని తెలిపారు. హర్యానా ఓటర్ల జాబితాలో ఓ మహిళ పేరు 223 సార్లు ఉన్నట్లు రాహుల్ మరో ఉదాహరణ ఇచ్చారు. బిజెపితో అనుబంధం ఉన్న వేలాది మంది ఉత్తరప్రదేశ్, హర్యానా రెండింటిలోనూ ఓటు వేశారని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిజెపి నాయకులు హర్యానాలో ఓట్లు వేసిన ఆధారాలను ఆయన మీడియా ముందు ప్రజెంట్ చేశారు. కౌంటింగ్‌కు రెండు రోజుల ముందు బిజెపి గెలుస్తుందని, బిజెపికి ఒక ప్రత్యేక వ్యవస్థ ఉందని ప్రస్తుత హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని చేసిన వీడియోను కూడా రాహుల్ గాంధీ ప్రదర్శించారు. హర్యానా ఫలితాలకు ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ విజయాన్ని సూచించాయని, ఆశ్చర్యకరమైన మరో విషయం ఏమిటంటే హర్యానాలో మొదటిసారిగా పోస్టల్ ఓట్ల ఫలితం కంటే భిన్నంగా ఉందని అన్నారు. హర్యానా ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి 3.5 లక్షల ఓట్లను ఈసి తొలగించిందని, వీరిలో అనేక మంది ఓటర్లు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసినట్లు ఆయన తెలిపారు. హర్యానాలో ఎన్నికలు జరగలేదని, అక్కడ దోపిడీ జరిగిందన్నారు. తాను చేస్తున్న ఆరోపణలకు ఇసి రికార్డులే సాక్ష్యాలు అని, వాటిని పరిశీలించి, మన ఎన్నికల తీరు ఎలా ఉంటుందో మీకు చూపిస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. బీహార్‌లోనూ ఇదే జరుగుతుందని, ఈ వ్యవస్థను మార్చలేమని, ఎందుకంటే ఓటర్ల జాబితా చివరి నిమిషంలో తయారవుతుందని, ఇది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని చంపడమే అని ఆయన పేర్కొన్నారు.

ట్రంప్‌కు ఎదురు దెబ్బ

- పలు రాష్ట్రాల్లో డెమోక్రాట్లదే విజయం!
- స్థానిక సంస్థల్లో భారత సంతతి నేతల సత్తా



వాషింగ్టన్ : అమెరికాలోని వర్జీనియా, న్యూజెర్సీ, న్యూయార్క్, కాలిఫోర్నియా నగరాలకు జరిగిన మేయర్, గవర్నర్ ఎన్నికల్లో డెమోక్రాట్లు విజయం సాధించారు. ఈ విజయం ట్రంప్‌కు పెద్ద ఎదురుదెబ్బే. కేవలం సంత్సర కాలానికే అమెరికా పౌరులు ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తున్నారని ఈ ఎన్నికలతో స్పష్టమైంది.

అమెరికాలో అతిపెద్ద నగరమైన న్యూయార్క్ మేయర్ ఎన్నికలో డెమోక్రటిక్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం సాధించగా, వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ గజాలా హష్మీ తన ప్రత్యర్థి రిపబ్లికన్ జాన్ రీడ్‌ను ఓడించారు. గవర్నర్ పదవిలో ముస్లిం మహిళ ఎన్నిక కావడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. వీరిద్దరూ భారత మూలాలు కలిగిన వారే కావడం విశేషం. న్యూజెర్సీ గవర్నర్ ఎన్నికలో డెమోక్రాట్ అభ్యర్థి మికీ షెర్రిల్ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాక్ సియాటరెల్లిని భారీ ఓట్ల తేడాతో ఓడించారు. న్యూజెర్సీ గవర్నర్‌గా ఎన్నికైన రెండవ మహిళ ఈమే. అలాగే కాలిఫోర్నియా, టెక్సాస్, ఓహియో, మిస్సోరా రాష్ట్రాలకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవన్నీ డెమోక్రాట్ పాలిత రాష్ట్రాలే. మొత్తంగా ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులను డెమోక్రటిక్ అభ్యర్థులు చిత్తుచిత్తుగా ఓడించారు.

డెట్రాయిట్ తొలి మహిళా మేయర్‌గా మేరీ షెఫీల్డ్

వాషింగ్టన్ : డెట్రాయిట్ నగర మేయర్‌గా తొలిసారి మహిళా నేత, సిటీ కౌన్సిల్ అధ్యక్షురాలు మేరీ షెఫీల్డ్ ఎన్నికయ్యారు. ఆమె తన ప్రత్యర్థి, ప్రముఖ మెగా చర్చి పాస్టర్ రెవరెండ్ సోలోమన్ కిల్సోచ్‌ని మంగళవారం జరిగిన ఎన్నికలలో ఓడించారు. మూడు సార్లు డెట్రాయిట్ మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన మైక్ డగ్గన్ స్థానంలో ఆమె జనవరిలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికలలో తిరిగి పోటీ చేయబోనని ఆయన గత సంవత్సరమే ప్రకటించారు. డగ్గన్ ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా మిచిగాన్ గవర్నర్ పదవి రేసులో ఉన్నారు. డెట్రాయిట్ నగరం అమెరికా చరిత్రలో దివాలా తీసిన అతి పెద్ద మున్సిపాలిటీ. అయితే 2014లో ఆ పరిస్థితి నుంచి బయటపడింది. ఆ తర్వాత పరిస్థితులు క్రమేపీ మెరుగయ్యాయి. కాగా మేయర్ పదవికి పోటీ పడిన షెఫీల్డ్, కిల్సోచ్...వీరిద్దరూ డెమొక్రాట్లే. షెఫీల్డ్ అభ్యర్థిత్వానికి డగ్గన్ మద్దతు తెలిపారు.



మీ కోసం

పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర కలిపి గ్రైండ్ చేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఏ కూరలోనైనా వాడుకోవొచ్చు.

జీవన సౌరభం

జీవితంలో చాలామంది గురువులు తారసపడతారు. కొందరు పాఠం నేర్పుతారు. మరికొందరు గుణపాఠం నేర్పుతారు.

వంటవాడు


సింహపురి రాజ్యాన్ని శ్రీధరుడు అనే రాజు పాలించేవాడు. రాజు భోజన ప్రియుడు. అక్కడి వంటవాడు సింగయ్య చాలా మంచి వంటగాడు. సింగయ్య వంటలను రాజు తెగ మెచ్చుకునేవాడు. ఒకరోజు సింగయ్యకి సుస్తీ చేసింది. దానితో అతను పనికి రాలేదు. అతని స్థానంలో మరొక వంటగాడు భద్రయ్యని పనికి పంపాడు మహామంత్రి. కొత్త వంటగాడు భద్రయ్య రకరకాల కూరలు, పులుసులు చేశాడు. కానీ రాజుకి ఆ వంటలు ఏమీ రుచించలేదు. పైగా 'అసలు రుచి పచి లేవు' అన్నాడు. వెంటనే మంత్రి, భద్రయ్యకి కబురు పెట్టి 'మహారాజుకి నీ వంటలు నచ్చలేదు. దీనికి నీ సమాధానం?' అన్నాడు. పక్కనే రాజు, కొంతమంది అధికారులు, రాజ వైద్యులు కూడా ఉన్నారు.

'మహారాజా, క్షమించాలి. నేను పూర్వపు వంటగాడిలా చాలా రుచికరంగా వండగలను. కానీ అవి రాజు గారి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. ఆ వంటల్లో అతిగా ఉప్పు, నూనెలు వాడారని పనివాళ్ల ద్వారా తెలుసుకున్నాను. ఉప్పు రక్తపోటుని పెంచుతుంది. నూనెలు కొవ్వుని పెంచుతాయి. తద్వారా ఊబకాయం, ఇతర వ్యాధులు వస్తాయి. నేను వచ్చినప్పుడే మహారాజుకి రక్తపోటు ఉందని వైద్యులు చెప్పారు. అందుకనే వంటలలో ఉప్పు తగ్గించాను. దాని వలన రుచి తగ్గవచ్చు. కానీ అదే అలవాటు చేసుకుంటే రుచిగానే ఉంటుంది, పైగా ఆరోగ్యం కూడా. రాజుగారి ఆరోగ్య సంరక్షణలో వంటవాడిదే కీలక బాధ్యత అని నా అభిప్రాయం' అన్నాడు భద్రయ్య. దానికి రాజవైద్యులు కూడా 'ఇది నిజం మహారాజ' అన్నారు.

భద్రయ్య మాటలు విన్న మహారాజు 'శభాష్! వంటతో పాటు మంచి విషయాలు తెలిసిన నీలాంటివాడు మా అంతఃపురంలో ఉండడం మాకు చాలా మంచిది. ఇకపై సింగయ్యతో పాటు నువ్వు కూడా శాశ్వతంగా మా వంటశాలలో ఉండిపోవచ్చు' అని అతనికి బోలెడు బహుమతులు కూడా ఇచ్చాడు.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

లెక్క తేల్చండి



పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

89 : జవాబు

నేను గీసిన బొమ్మ



ఎస్‌డి.అఫ్సా సమీహా,
9వ తరగతి,
శ్రీచైతన్య స్కూల్, విశాఖపట్నం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రపంచాన్ని ఎలా చూడాలో అమ్మ నేర్పింది!

ఆ ఇంట్లో అమ్మానాన్న భోజనం ప్లేటు దగ్గర కూర్చొని సినిమాలు, షికార్లు, పుకార్ల గురించి ఎప్పుడూ చర్చించలేదు. వాళ్లు.. ప్రపంచంలో ఏది తప్పుగా జరుగుతోంది? ఏ అన్యాయానికి పరిష్కారం అవసరం? ఏ కథ లోకానికి చెప్పడం లేదు?' అన్న అంశాలపై చర్చించారు. ఆ విశ్లేషణలను వింటూ పెరిగిన వాళ్ల కొడుకు ఇప్పుడు ప్రపంచమంతా తనవైపు తిప్పుకునేంత ఎత్తు ఎదిగాడు. అమెరికా గడ్డపై న్యూయార్క్ పట్టణ మేయర్‌గా తొలిసారి ఓ సోషలిస్టుగా ఎన్నికై తన పేరుని చరిత్ర పుటల్లో లిఖించాడు. అతడే జోహ్రాన్ మమ్దానీ.

జోహ్రాన్ 1991లో ఉగాండాలోని కంపాలలో జన్మించారు. తల్లి మీరానాయర్, తండ్రి మహ్మద్ మమ్దానీ. ఇద్దరూ భారతీయులే. మీరా బాలీవుడ్ చిత్రరంగంలో అవార్డులు కొల్లగొట్టిన ప్రముఖ చిత్రాలు 'సలాం బాంబే', 'మాన్‌సూన్ వెడ్డింగ్' వంటి సినిమాలని తెరకెక్కించారు. ఈ కుటుంబం జోహ్రాన్‌కి ఐదేళ్లప్పుడు దక్షిణాఫ్రికాకి వెళ్లి, ఆ తరువాత న్యూయార్క్ నగరంలో స్థిరపడ్డారు. బాల్యం నుండి న్యూయార్క్ వీధుల్లో పెరిగిన జోహ్రాన్ ఎన్నోసార్లు వివక్షని ఎదుర్కొన్నాడు. ఆ సందర్భాన్ని ఒకసారి ఆయన ఇలా చెప్పారు. 'నా స్నేహితుడు ఒకసారి నన్ను 'మీరు సనాతనవాదులు కారు' అని చెప్పాడు. 'కానీ మేము బుద్ధిమంతులం. మా కుటుంబంలో ప్రార్థన ఉంది. కవిత్వమూ ఉంది. మా ఇంట్లో ఉర్దూ గజల్స్ ఉంటాయి. ఆఫ్రికన్ జానపద కథలు వినిపిస్తాయి' అని చెప్పాను' అని జోహ్రాన్ గుర్తు చేసుకున్నారు. ఇలాంటి అనుభవాలు ఎన్నో అతనికి ఎదురయ్యాయి. 'తనని ఇంతటి శక్తిమంతుడిగా తీర్చిదిద్దింది అమ్మానాన్నే' అని జోహ్రాన్ గర్వంగా చెబుతారు. 'వలస వెతలు, బాల కార్మికులు, గుర్తింపు, సంస్కృతి వంటి ఇతివృత్తాలని అద్భుతంగా తెరపై తెరకెక్కించిన తల్లి పెంపకంలో తాను ఉన్నతంగా ఎదిగానని జోహ్రాన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

అమ్మానాన్న నన్ను తీర్చిదిద్దారు..

మరోసారి తన తల్లి గురించి ఆయన ఇలా అన్నారు. 'హ్యారీ పోర్టర్ లాంటి సినిమాలని ఏ మంచి దర్శకుడైనా రూపొందిస్తారు. కానీ అమ్మ తీసిన చిత్రాలను కేవలం ఆ వ్యక్తులు, వాళ్ల బాధలను పట్టించుకునే వ్యక్తులకి మాత్రమే సాధ్యం. సమాజంలో వివక్షకి గురవుతున్న వర్గాల పట్ల నా తల్లిదండ్రీ నిలబడడం నిజంగా నాకు గర్వకారణం. వాళ్లు చెప్పిన కథలు గ్లామర్‌గా ఉండవు. అవి సృజనాత్మకతని, విలువైన విషయాలని, ప్రపంచం చూడని కథలని ఎత్తిచూపుతాయి. వాటి శక్తిని అర్థం చేసుకోవడం అంటే ప్రజా విధానాన్ని అర్థం చేసుకోవడమే అని నా అభిప్రాయం' అని చెబుతున్న జోహ్రాన్, తల్లిదండ్రుల సంరక్షణలో క్రియాశీలకమైన భావజాలంతో పెరిగారు. ప్రపంచంలో నెలకొన్న అసమానతలని చిన్నప్పట నుండే అతను అవగతం చేసుకోవడం మొదలుపెట్టారు. జోహ్రాన్ మాటల్లో చెప్పాలంటే 'కళ', 'క్రియాశీలత' వేరు కాదని నేర్పించారు' అంటారు.

ఈ వాతావరణం యుక్తవయసు వచ్చిన జోహ్రాన్‌కి భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన అవగాహన రావడానికి దోహదపడింది. బౌడోయిన్ కళాశాలలో ఆఫ్రికానా స్టడీస్ చదవిన జోహ్రాన్ క్రమంగా రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యారు. అన్యాయం గురించి మాట్లాడడం, న్యాయం కోసం పోరాడడంతోనే తన ప్రచారాలు కొనసాగించారు.

2013లో మీరా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో జోహ్రాన్ గురించి ఇలా చెప్పారు. 'అతను అమెరికన్ కాదు. తనని ఉగాండాగా, భారతీయుడిగా గుర్తించడానికే మొగ్గుచూపుతాడు. పుట్టుక, మూలాలు, స్థానికత తనని ప్రపంచానికి దగ్గర చేశాయి. ఈ పరిస్థితులు తనని దృఢత్వం గల వ్యక్తిగా తీర్చిదిద్దాయి' అన్నారు.



తల్లిదండ్రులతో మమ్దానీ

తల్లిదండ్రుల గురించి జోహ్రాన్ మరో సందర్భంలో ఇలా చెప్పారు. 'అమ్మ నాకు ఈ ప్రపంచాన్ని ఎలా చూడాలో చెప్పింది'. నాన్న తరచూ తన వలస రాజ్యాంతర సిద్ధాంతాన్ని ఇంట్లో చర్చించడం వల్ల సమాజంలో వేళ్లూనుకున్న వివక్షని అర్థం చేసుకుంటూ పెరిగాను' అని చెప్పారు.

కళాకారిణిగా తల్లి కొడుకుని సమాజాన్ని సృజనాత్మకంగా చూడడం నేర్పిస్తే, విద్యావంతుడైన తండ్రి తన విమర్శనాత్మక ఆలోచనల్లో కొడుకుని మమేకం చేశారు. ఫలితంగా జోహ్రాన్ లాంటి నాయకుడు కొత్త తరానికి గొప్ప ఆశగా ఆవిర్భవించాడు. పదవి కోసం పోటీపడిన అతనిని కేవలం రాజకీయ నాయకుడిగా కాదు, మార్పు కోసం జీవించే వ్యక్తిగా అతని స్నేహితులు, సహచరులు చూశారు. అతని ప్రచారం ఎప్పుడూ అధికారం కోసం పరుగులా ఉండేది కాదని గుర్తు చేసుకున్నారు. 'అది అతని ఇంటి జీవితం నుండి అందజేసిన హోంవర్క్ అసైన్‌మెంట్‌లా, బాధ్యతల అప్పగింతగా ఉండేది' అంటున్నారు. ఇది మేయర్ కథ మాత్రమే కాదు. కళని నమ్మిన తల్లి, ఆలోచనని నమ్మిన తండ్రి, ఉద్దేశాన్ని నమ్మిన కొడుకు గురించి.

మరో సంచలనం గజాలా హష్మీ



హైద్రాబాద్‌లో పుట్టి పెరిగిన గజాలా హష్మీ తాజా ఎన్నికల్లో వర్జీనియా గవర్నర్‌గా ఎన్నికై చరిత్రని తిరగరాశారు. 1964లో హైద్రాబాద్‌లో తన అమ్మమ్మ ఇంట్లో 4 ఏళ్లు పెరిగిన హష్మీ, ఆ తరువాత కుటుంబంతో జార్జియాకి వలస వెళ్లారు. ఆ సమయంలో వలసవెళ్లిన రెండు ముస్లిం కుటుంబాల్లో హష్మీ కుటుంబం ఒకటి. 'ముస్లిం వ్యక్తిని కావడం వల్ల చిన్నతనం నుండే పెద్ద పెద్ద ప్రశ్నలు ఎదుర్కొనడం అలవాటైంద'ని ఒకసారి హష్మీ చెప్పారు. ఉన్నత విద్యావంతురాలైన ఆమె 2019 నుండి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. ప్రజలకు అందుబాటులో విద్య, ఆరోగ్యం, తుపాకీ సంస్కృతిని రూపుమాపడం, వాతావరణ చర్యలు, గృహాలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం తన ప్రచారంలో గట్టిగా వినిపించారు.

తన ప్రయాణం గురించి ఆమె ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు. 'చిన్న వయసులోనే పెద్ద పెద్ద ప్రశ్నలతో పోరాడడం నేర్చుకున్నాను. అవి చాలా అన్యాయంగా ఉండేవి. అయితే అవి క్రమంగా నా గుర్తింపుని అర్థం చేసుకోవడానికి, నన్ను నేను సమర్థవంతంగా తీర్చిదిద్దుకోవడానికి సహాయపడ్డాయి. ఆ భావజాలాలని బద్దలు కొట్టడమే ఇప్పుడు నా ముందున్న అతిపెద్ద లక్ష్యం. అమెరికన్ సమాజంలో, సంస్కృతిలో ముస్లింలు కొన్ని శతాబ్దాలుగా భాగమయ్యారు. ఇప్పుడు ట్రంప్ మా మధ్య అడ్డుగోడలు కడుతున్నారు. 'మీరు ఈ దేశస్తులు కాదు బయటికి పొమ్మం'టున్నారు. అతని ప్రేలాపనలకి నా ఎన్నిక గట్టిగా బుద్ధి చెప్పింది' అంటున్న హష్మీ తన రాజకీయ ప్రస్థానంలో పలు కీలక పదవులని అధిరోహించారు. తాజా ఎన్నికతో మరో మైలురాయిని చేరుకున్నట్లు అయ్యింది.

'రాజు వెడ్స్ రాంబాయి' హిట్ ఖాయం : మంచు మనోజ్



'అఖిల్ ఉడ్డెమారి, తేజస్విరావ్ జంటగా నటించిన సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుంది. లవ్, ఎమోషనల్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా కుటుంబ కథా చిత్రంగా అన్ని తరగతుల ప్రేక్షకుల అంచనాలకు చేరుకుంటుందని భావిస్తున్నా. సరికొత్త ప్రేమ కథ కావటంతో యువత ఈ సినిమాను బాగా ఆదరిస్తానేది నా నమ్మకం. ప్రేక్షకులు ఈ సినిమాను విజయవంతం చేయాలని కోరుతున్నా. చిత్ర యూనిట్ ఎంతో కష్టపడి ఈ సినిమా కోసం పనిచేసింది. ప్రేక్షకాదరణ పొందిన ఈ సినిమా ఎక్కువ అవార్డులు గెల్చుకుంటుందనటంలో ఎలాంటి సందేహం లేదు' అని కథానాయకుడు మంచు మనోజ్, ఆయన సతీమణి భూమా మౌనిక అన్నారు. అఖిల్, తేజస్విని జోడీగా తెరకెక్కిన 'రాంబాబు వెడ్స్ రాంబాయి' సినిమాలోని 'రాంబాయి నీ మీద నాకు..' పాట విడుదల కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంది. డాక్టర్ నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఈనెల 21న ఈ సినిమా విడుదల చేయిస్తున్నారు. పాటల రచయిత మిట్టపల్లి సురేందర్, నటుడు శివాజీ రాజా, నటుడు చైతు జొన్నలగడ్డ, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్, హెడ్ సాయికృష్ణ, నిర్మాత వేణు ఊడుగుల, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, డైరెక్టర్ సాయిలు కంపాటి మాట్లాడారు.

మంచి సందేశంతో 'ది గర్ల్‌ఫ్రెండ్'

అల్లు అరవింద్



'నిర్మాతగా ఎన్నో సినిమాలు చేస్తున్నా. ఆర్థికంగా కూడా స్థిరపడ్డా. 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ద్వారా నేను సంపాదించాలనుకున్నది డబ్బు కాదు. సంతృప్తి. ఈ సినిమా నిర్మించాననే విషయం ఎంతో సంతృప్తినిస్తోంది. మనకు తెలిసిన కొన్ని చెప్పలేని నిజాలను సినిమా మాధ్యమం ద్వారా చెప్పాలనే ఫీల్ ఈ కథ విన్నప్పుడు కల్గింది. రాహుల్ లాంటి సున్నిత మనస్కుడు, కమిటెడ్ పర్సన్ మాత్రమే ఇలాంటి సినిమాను రూపొందించగలరు. ఆయన కథ చెబుతున్నప్పుడు ఎంత ఉద్వేగంతో చెప్పారో, సినిమాను కూడా అంతే బాగా తెరకెక్కించారు. కేవలం వినోదం కోసం మాత్రమే చూసే సినిమా కాదు. మన అక్క, చెల్లి, పిన్ని వాళ్ల మనసుల్లో ఏముంటుంది, ఎలాంటి కోర్కెలు ఉంటాయి అనుకుని మూవీ చూడాలి. ది గర్ల్ ఫ్రెండ్ కాకుండా మరో టైటిల్ ఈ సినిమాకు చెప్పమంటే నీ జీవితమంతా నేనే అని చెప్పాలి. అమ్మాయి అబ్బాయి తమ జీవిత భాగస్వామి గురించి ఇలాగే అనుకుంటూ అతి సున్నితంగా సాగే ఈ సినిమా చివరకు అతి ఘాటుగా ముగుస్తుంది. ప్రతి ఫ్యామిలీలో ప్రతి పర్సన్ ఈ మూవీలోని కథతో రిలేట్ అవుతారు. తమకు కాకున్నా తమకు తెలిసిన వారికి ఇలా జరిగింది అనుకుంటారు. రశ్మిక ఈ సినిమాలో జీవించారు. దీక్షిత్ చాలా మంచి పర్‌ఫార్మెన్స్ ఇచ్చారు' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. రశ్మిక మందన్నా, దీక్షిత్‌శెట్టి జంటగా నటించిన సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కిన ఈ సినిమా ఈనెల ఏడోతేదీన హిందీతోపాటుగా తెలుగులో 14న, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్‌ఈవెంట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడారు. ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, సంగీత దర్శకులు ప్రశాంత్ విహారి హేషమ్ అబ్దుల్ వాహాబ్ మాట్లాడారు.




'జటాధర' నుంచి కొత్త ట్రైలర్

నటుడు సుధీర్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర'. వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కళ్యాణ్ కథ అందించారు. బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా కీలక పాత్రలో నటించారు. నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ సినిమా ఈనెల ఏడోతేదీన విడుదల కానుంది. కొత్త టీజర్‌ను బుధవారంనాడు చిత్ర యూనిట్ విడుదల చేసింది. రైన్ అంజలి, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రల్లో నటించారు. జీ స్టూడియో సమర్పణలో ఉమేష్ కె.ఆర్.భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మించారు.

త్వరలో 'ఉస్తాద్ భగత్ సింగ్'

కొత్త షెడ్యూల్



పవన్ కళ్యాణ్ నటిస్తున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఇప్పటికే ఈ సినిమా కొంతమేరకు షూటింగ్ జరిగింది. పవన్ కళ్యాణ్ పార్ట్‌కు సంబంధించిన షూటింగ్ పూర్తయ్యింది. కొన్ని పోర్షన్లు మాత్రమే మిగిలి ఉన్నాయని సమాచారం. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. రాశీఖన్నా కీలకపాత్రలో నటిస్తున్నారు. కొత్త షెడ్యూల్ ఈనెల చివరి వారం నుంచి మొదలై డిసెంబర్ మూడో వారం వరకు సాగనుందని సమాచారం. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత సినిమా విడుదల తేదీని మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించనున్నారు.

ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌తో 'చిరంజీవ' : అనిల్ రావిపూడి

"చిరంజీవ' మూవీ కాన్సెప్ట్ గురించి అభి చెప్పాడు. చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. అభి నాకు గౌతమ్ ఎస్ఎస్‌సి సినిమా దగ్గర నుంచి తెలుసు. ఆ సినిమాలో మంచి రోల్ చేశాడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. ఆ మూవీ తర్వాత మేము మంచి ఫ్రెండ్స్ అయ్యాం. యాక్టర్లను బాగా ఇమిటేట్ చేస్తుంటాడు. కందిరీగ సినిమాకు తెలంగాణ యాసలో డైలాగ్స్ రాసేందుకు అభి హెల్ప్ చేశాడు. అదిరే అభిగా జబర్దస్త్‌తో తెలుగు ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు దర్శకుడిగా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా. రాజ్‌తరుణ్‌కు కూడా ఈ సినిమా కమ్ బ్యాక్ కావాలని కోరుకుంటున్నా. చిరంజీవ టీమ్ అందరికీ ఆల్ ది ది బెస్ట్' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. రాజ్ తరుణ్ కథానాయకుడిగా నటించిన ఆహా ఒరిజినల్ ఫిల్మ్ 'చిరంజీవ'. కుషిత కల్లపు కథానాయిక. స్ట్రీమ్‌లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మించారు. అభినయ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ నెల ఏడోతేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. బుధవారం హైదరాబాద్‌లో ప్రీమియర్ షోను ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ రావిపూడి పై విధంగా మాట్లాడారు.



ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌ను సాధించిన భారత మహిళల క్రికెట్ జట్టు బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ట్రోఫీని ప్రధానికి అందజేసి జట్టు ఆటగాళ్ల ప్రదర్శన, సాధించిన విజయాలను వివరించారు.

మరో గెలుపుపై టీమిండియా గురి

నేడు ఆస్ట్రేలియాతో నాల్గో టి20
మధ్యాహ్నం 1.45ని.లకు

క్వీన్స్‌లాండ్: ఐదు టి20ల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్న దశలో నేడు జరిగే నాల్గో మ్యాచ్ ప్రాధాన్యత సంతరించుకుంది. సిరీస్‌ను చేజిక్కించుకోవాలంటే ఇరుజట్లకు ఈ మ్యాచ్‌లో గెలుపు తప్పనిసరి. తొలి టి20 వర్షం కారణంగా రద్దు కాగా.. రెండో టి20లో ఆసీస్, మూడో టి20లో టీమిండియా విజయం సాధించాయి. ముఖ్యంగా మూడో టి20లో టీమిండియా గెలుపులో పేసర్ అర్షదీప్ సింగ్ కీలకపాత్ర పోషించాడు. తన అద్భుత స్పెల్‌తో 35పరుగులకే 3కీలక వికెట్లు పడగొట్టి ఆసీస్‌ను కట్టడి చేశాడు. దీంతో ఆ జట్టు 187 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా ముందు ఉంచినా.. మన బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని మరో 9 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు సుందర్(49నాటౌట్; 23బంతుల్లో 3ఫోర్లు, 4సిక్సర్లు), జితేశ్ శర్మ(22నాటౌట్; 13బంతుల్లో 3ఫోర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(25; 16బంతుల్లో 2ఫోర్లు, 2సిక్సర్లు) రాణించినా.. శుభ్‌మన్(15) నిరాశపరిచాడు. దీంతో టి20 సిరీస్ చేజిక్కించుకోవాలంటే ఇరుజట్లకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. ఏ జట్టు గెలిచినా.. సిరీస్ ఆశలు సజీవంగా నిలుపుకోనున్నాయి.



జట్లు(అంచనా)...

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్/జైస్వాల్, సంజు(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, దూబే/అర్ష్‌దీప్, అక్షర్, హర్షిత్ రాణా, కుల్దీప్, వరణ్ చక్రవర్తి, బుమ్రా.

ఆస్ట్రేలియా: మాఛెల్ మార్ష్(కెప్టెన్), ఇంగ్లిస్(వికెట్ కీపర్), హెడ్, టిమ్ డేవిడ్, ఓవెన్, స్టొయినీస్, బార్ట్‌లెట్, ఎల్లిస్, కుహ్నేమన్, షార్ట్, హేజిల్‌వుడ్.

టి20లకు శుభ్‌మన్‌ను దూరంగా ఉంచండి

ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ సూచన

టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను టి20 ఫార్మాట్‌కు దూరంగా ఉంచాలని ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ టీమిండియా సెలెక్షన్ కమిటీకి సూచించాడు. 4వ టి20కి ముందు బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. వర్క్‌లోడ్, మూడు ఫార్మాట్‌లకు ఒకే కెప్టెన్ కారణాలతో అతడిని టి20 ఫార్మాట్‌లోనూ కొనసాగించడం సరి కాదని సూచించాడు. ఆసీస్ పర్యటనలో భాగంగా శుభ్‌మన్ ఆడిన మూడు మ్యాచుల్లో చేసింది(27, 5, 15) 47పరుగులే. ఈ సిరీస్‌కు ముందు జరిగిన ఆసియాకప్ టోర్నీ 7మ్యాచుల్లోనూ (20,10,5,47,29,4,12) 127పరుగులే చేశాడు. టి20 కెరీర్‌లో శుభ్‌మన్ ఆడిన 31మ్యాచుల్లో 28.22 సగటుతో 762పరుగులే చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మరో అర్ధసెంచరీ మాత్రమే ఉన్నాయి. శుభ్‌మన్ కంటే వెనుక టి20ల్లో అరంగేట్రం చేసిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 26 ఇన్నింగ్స్‌ల్లో 961 పరుగులు చేసి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నాడు. శుభ్‌మన్‌తో పాటు జాతీయ జట్టుకు ఎంపికైన యశస్వి జైస్వాల్ 23 టి20ల్లో 36.15 సగటుతో 723పరుగులు చేశాడు. అలాగే ఐపిఎల్ సీజన్-2025 అదరగొట్టే ప్రదర్శనతో రాణించాడు. కానీ అతడిని ఈ ఫార్మాట్‌కు ఎంపిక చేయడం లేదు. కేవలం టెస్టులకే పరిమితం చేస్తున్నారు. ఇలా ఐపిఎల్‌లో ఎంతోమంది యువ క్రికెటర్లు రాణిస్తున్నా.. వారందరినీ ప్రక్కనబెట్టి శుభ్‌మన్‌ను ఈ ఫార్మాట్‌లో కొనసాగించడం పలు విమర్శలకు తెర దారితీస్తోంది.

టాప్‌లోనే అభిషేక్ శర్మ

ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) తాజా టి20 ర్యాంకింగ్స్‌లో భారత యువ సంచలనం అభిషేక్ శర్మ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టి20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తూ.. తన నెంబర్ వన్ స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అభిషేక్ వర్మ 925 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ(788) మూడోస్థానంలో ఉన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(696) ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రెండోస్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్(849), నాలుగో స్థానంలో నిస్సంక(శ్రీలంక-779), నాలుగో స్థానంలో జోస్ బట్లర్(ఇంగ్లండ్-770) ఉన్నారు. ఇక టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(799) అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్(659) రెండు స్థానాలు మెరుగుపరచుకొని 10వ స్థానానికి చేరాడు. కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికిందర్ రాజా, వెస్టిండిస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టి20ల్లో రాజా 33బంతుల్లో సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అక్షర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68